### విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

TELTEL/2012/47103

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 12 సంచిక :99 నల్గొండ | శుక్రవారం 04-07-2025 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 | వెల : రూ.1/-


## మీనాక్షితో కొండా మురళీ దంపతులు భేటి...



హైదరాబాద్ : వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ వివాదాల నేపథ్యంలో కొండా మురళి. సురేఖ దంపతులు నేడు కాంగ్రెస్ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ తో భేటి అయ్యారు. తన వ్యాఖ్యలపై ఇంచార్జీ కి వివరణ ఇచ్చారు. ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ కి 16 పేజీల లేఖ సమర్పించారు. కాగా, కడియం శ్రీహరి, బసవరాజు సారయ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిలను పరోక్షంగా మురళీ విమర్శించారు. దీంతో ఆయే నేతలు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. ఈ వివాదాల నేపథ్యంలో నేడు మంత్రి కొండా సురేఖ, మురళీలు మీనాక్షిని కలసి తమ వాదనలను వినిపించారు. ఈ సందర్భంగా కొండా మురళీ మీడియాతో మాట్లాడుతూ, తాను వెనకబడిన వర్గాల ప్రతినిధినని.. నలభై నాలుగు ఏండ్ల నుంచి నా ఎపిసోడ్ నడుస్తూనే ఉందని అన్నారు.. ఒకరి గురించి నేను కామెంట్ చేయనంటూ తనకు ప్రజాబలం ఉందన్నారు.. తనకు భయపడకపోతే నాపై 23 కేసులు పెట్టకపోయేవాళ్ళుకాదన్నారు పోటా, టడా కేసులకే తాను భయపడలేదని అన్నారు. ..

వరంగల్ జిల్లా వివాదాలు ప్రస్తుతం క్రమశిక్షణ కమిటి పరిధిలో ఉన్నదని అన్నారు.. అయినా తనను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని వివరించారు%%. నాయిని రాజేందర్ రెడ్డి చేసిన బొంగెం కాదు అనే వ్యాఖ్యలను ఇంచార్జి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.ఇక రేపు జరగబోయే మీటింగ్ పై చర్చించామన్నారు.. రేపు వరంగల్ నుంచి ఎంత మంది వస్తారు అనేది చర్చించామని పేర్కొన్నారు.. కాంగ్రెస్ పార్టీ నీ బ్రతికించడం, రాహుల్ గాంధీ నీ ప్రధాని చేయడం నా ఉద్దేశమని మురళీ అన్నారు%% పని చేసే వాళ్లపైనే రాళ్ళు విసురుతారని పేర్కొన్నారు.. లోకల్ బాడీ ఎన్నికల్లో అన్ని కాంగ్రెస్ గెలిచేలా.. ఎమ్మెల్యేలను మళ్ళీ వరంగల్ లో గెలిపించడం నా బాధ్యత అన్నారుతాను బీసీ కార్డు పైనే బ్రతుకుతున్నానని, రోజు 500 మంది ప్రజలకు భోజనం పెడతానని చెప్పారు ప్రజల సమస్యలు తీర్చేందుకు ముందు ఉంటాను కాబట్టి ప్రజలు వస్తున్నారు.. ఎలాంటి గ్రూప్ రాజకీయాలతో తనకు సంబంధం లేదంటూ తన కుమార్తె ఎక్కడి నుంచి పోటీ చేయడం లేదన్నారు.

## రాష్ట్రంలో పోలీస్ శాఖ మాత్రమే పనిచేస్తున్నది..

నల్లగొండ : కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో ఒక్క రూపాయి అభివృద్ధి జరగలేదు. కానీ, వందలాది కేసులు పెడుతున్నారు. రాష్ట్రంలో పోలీస్ శాఖ మాత్రమే పని చేస్తుందని ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఫైర్ అయ్యారు. నల్లగొండ జిల్లా చండూరులో మీడియా సమావేవంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించన వారిపై అనేక అక్రమ కేసులు పెడుతుంది. చండూరు మున్సిపల్ చైర్మన్ ఇల్లు కూల్చి వేశారు. ఇలా కేసులు పెట్టి భయపెట్టి ఓట్లు వేయించుకుందాం అనుకుంటున్నారని మండిపడ్డారు. పనులు లేక బీఆర్ఎస్ చేసిన పనులకే కొత్తగా బోర్డులు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కొత్తగా తెచ్చి వేసిన రోడ్డు లేదు.వ్యవసాయరంగం పూర్తిగా నిర్లక్ష్యం అయిందన్నారు. తెలంగాణ వచ్చే నాటికి నల్లగొండ అఖరులో ఉంటే..కెసిఆర్ పాలనలో అగ్రస్థానం లో నిలిచిందని గుర్తు చేశారు. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చేశా. కానీ మళ్లీ కాంగ్రెస్ పాలనలో నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా వస్తున్నాయని ఆరోపించారు. నిన్నటి రివ్యూ మీటింగ్ లో వాళ్ల ఎమ్మెల్యేలే అంటున్నారు. ఇదేం సమీక్షా అని. మంత్రులు మాత్రమే మాట్లాడితే మేం ఎందుకు అని ఎమ్మెల్యేలు అనుకుంటున్నారన్నారు. కొంత మంది ప్రజా ప్రతినిధులు పోలీసల నుంచి మామూళ్లు తీసుకోవడం దురదృష్టకరమన్నారు. ఉత్తమ్ నీటి పారుదల, సివిల్ సప్లై శాఖ లపై అవగాహన లేదు.కృష్ణా నదితో పాటు గోదావరి జాలలను సైతం ఆంధ్రకు అప్ప జెపుతున్నారు. సీఎం, మంత్రులు కెసిఆర్‌ను తిట్టడంలోనే పోటీ పడుతున్నారని విమర్శించారు. నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ నేతలపై, కార్యకర్తలపై అక్రమకేసులు పెడుతున్నారు. ఇలాంటి కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. సమస్యలపై ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల విషయంలో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో కాంగ్రెస్ దుర్మార్గలకు చెక్ పెట్టాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.ఇవ్వాళ చండూరులో జరుగుతున్న పనులన్నీ బీఆర్ఎస్ సర్కార్ ఇచ్చినవే. మునుగోడు ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చుందుకు మేము ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ పనులు మంజూరు ఇచ్చాము. మునుగోడులో ఇప్పుడు అక్కడక్కడా జరుగుతున్న పనులన్నీ కెసిఆర్ హయాంలోనివేనని స్పష్టం చేశారు. కమీషన్స్ కోసం బిల్లులు ఆపడం కాంగ్రెస్ నేతలకే చెల్లిందన్నారు.మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు పాల్వాయి స్రవంతి, రెగట్టే మల్లికార్జున రెడ్డి, మాజీ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బ తీసింది...

తిరుమల: గత జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమలలో చాలా అక్రమాలు జరిగాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ఆరోపించారు. గతంలో ఉన్న టీటీడీ పాలకమండళ్లు భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడాయని విమర్శించారు. ఇవాళ(గురువారం) ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో వెంకటేశ్వర స్వామివారిని లక్ష్మణ్ దర్శించుకున్నారు.అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం తిరుమల పవిత్రతను దెబ్బతీసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామి వారి లడ్డూలో జరిగిన కల్తీ భక్తులను ఆందోళనకు గురి చేసిందని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో తిరుమలలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తానని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై రామచందర్ రావు విమర్శలు

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ(గురువారం) రామచందర్ రావు ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటా లేదా.. బీజేపీతో ఎవరికైనా మైత్రి ఉందా అనేది వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో, గ్రేటర్ ఎన్నికల్లో తెలుస్తుందని చెప్పుకొచ్చారు.రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కమల వికాసమేనని ధీమా వ్యక్తం చేశారు. తనకు తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి రావడంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పాత్ర ఉందని ఎవరూ నిరూపించిన వారికీ ఆస్కార్ అవార్డ్ ఇప్పిస్తామని విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులకు తాము సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు. బీజేపీ



అధిష్టానం తనకు ఇచ్చిన అవకాశాన్ని ప్రతి కార్యకర్త, పార్టీ అధికారం కోసం పనిచేస్తానని రామచందర్ రావు పేర్కొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందా: ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందా అని బీజేపీ సీనియర్ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం బీఆర్ఎస్ మాజీ మంత్రుల కనుసన్నల్లో ఉన్నట్లుందని విమర్శించారు. మామ, అల్లుళ్ల అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. జగన్ మాయలో పడి ప్రాజెక్టులు కట్టకుండా నీరుగార్చారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రేమాయణం.. కాంగ్రెస్ డోలాయమానమని ఎద్దేవా చేశారు. సాగు, నీటి ప్రాజెక్టులపై రెండు పార్టీలది సవాళ్ల డ్రామా అని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు.

## బనకచర్ల ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదు..

అమరావతి,బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని ఏపీ సీఎం చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. వందేళ్ల నుంచి గోదావరిలో ఏటా సగటున 2 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి పోతోందన్నారు.వృథా అవుతున్న నీటిని వినియోగించుకునేందుకే బనకచర్ల ప్రాజెక్టు అని తెలిపారు. ఎగువ ఉన్న తెలంగాణ వాళ్ల ప్రాజెక్టులు కట్టుకుంటే తాను ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదని, ఇకపై కూడా చెప్పను అని చెప్పారు. సముద్రంలోకి పోయే నీళ్లను వాడుకుంటే రాష్ట్రాలు బాగుపడతాయని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. కుప్పంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు.'బనకచర్ల ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదు. కొందరు అనవసరంగా రాజకీయం చేస్తున్నారు. వృథా అవుతున్న గోదావరి నీళ్లు వాడుకోవాలన్నదే మా ఉద్దేశం. ఏటా సగటున 2 వేల టీఎంసీల నీళ్లు వృథాగా సముద్రంలోకి పోతున్నాయి. వృథా అవుతున్న నీటిని వినియోగించుకునేందుకే బనకచర్ల ప్రాజెక్టు. ఎగువ ఉన్న తెలంగాణ వాళ్ల ప్రాజెక్టులు కట్టుకుంటే నేను ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు, ఇకపై కూడా అభ్యంతరం చెప్పను. సముద్రంలోకి పోయే నీళ్లను వాడుకుంటే రాష్ట్రాలు బాగుపడతాయి. నీటి సమస్య పరిష్కారమైతే తెలుగు ప్రజలు బాగుంటారు' అని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య బనకచర్ల ప్రాజెక్టు తీవ్ర వివాదంగా మారింది. ఎలాగైనా బనకచర్లను అడ్డుకుంటామంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించగా.. మిగులు జలాలనే కదా? మేం



వాడుకునేది, అభ్యంతరాలు ఎందుకంటూ ఏపీ ప్రభుత్వం ప్రశ్నించింది. దీనిపై కేంద్ర మంత్రులను కలిసి ఫిర్యాదులు కూడా చేశారు తెలంగాణ సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి. అనంతరం ఏపీ ప్రభుత్వానికి కేంద్ర సర్కార్ షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని, అనుమతులు ఇవ్వాలంటే గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) తీర్పును పరిశీలించాల్సి ఉందని చెప్పింది. పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించడం అవసరమని అభిప్రాయపడింది.

## ఫార్ములా కేసులో ఎసిబి విచారణ హాజరైన అరవింద్ కుమార్



హైదరాబాద్,జూలై3, ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ గురువారం ఏసీబీ ఎదుట హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి మూడోసారి ఏసీబీ విచారణకు వచ్చారు . ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో నిధుల బదలాయింపులో అరవింద్ కుమార్ కీలక పాత్ర పోషించారని ఏసీబీ గుర్తించింది. హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా పని చేస్తూ నిధులను మళ్లించినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. కేబినెట్ అనుమతి లేకుండా నిధులను బదిలాయించినందుకు ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కూడా ఇప్పటికే రెండుసార్లు ఏసీబీ అధికారులు విచారించారు. జూన్ 16న కేటీఆర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగానే అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నిస్తోంది. ఎఫ్ఈవో కంపెనీకి దాదాపు రూ.45 కోట్లు 71 లక్షల నగదును బదిలీ చేశారు. వాటికి సంబంధించే మూడోసారి అరవింద్ కుమార్‌ను విచారణకు పిలిచి ఏసీబీ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. ప్రధానంగా క ఏబినేట్ అనుమతి లేకుండా నిధుల బదలాయింపుపై ప్రశ్నించినట్లు సమాచారం. హైదరాబాద్‌లో 2023లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేస్ కోసం విదేశీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా సొమ్ము చెల్లించడం వల్ల ప్రభుత్వానికి రూ.54.88 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఏసీబీ కేసు నమోదు చేసింది. రేస్ నుంచి ఫార్ములా-ఈ ఆపరేషన్స్ తప్పుకొన్న అనంతరమూ నిధులు ఎందుకు విడుదల చేయాల్సి వచ్చిందనే కోణంలో ఆరా తీసింది. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నా ఆర్థికశాఖ నుంచి అనుమతి తీసుకోకపోవడం.. మంత్రివర్గం ఆమోదం పొందకపోవడం.. తదుపరి మూడేళ్లపాటు రేస్‌ల నిర్వహణకు రూ.600 కోట్ల మేర చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకోవడాన్ని అంతర్గత విచారణలో ప్రభుత్వం తప్పుపట్టింది. ఆర్థికశాఖ నుంచి అనుమతి తీసుకోకుండానే రూ.54.88 కోట్ల మేర చెల్లించడాన్ని తీవ్ర నేరంగా పరిగణించింది. దీనిపై ప్రస్తుతం ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. అయితే పురపాలక శాఖ మంత్రి హోదాలో కేటీఆర్ ఆదేశించడంతోనే తాము నిధులు విడుదల చేసినట్లు అప్పట్లో హెచ్ఎండీఏ కమిషనర్‌గా కొనసాగిన అర్వింద్‌కుమార్ ఇదివరకే ప్రభుత్వానికి లిఖితపూర్వక వాంగ్మూలం ఇవ్వడంతోపాటు ఏసీబీ విచారణలోనూ అంగీకరించారు.

## బిసి రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి అఖిలపక్షం

హైదరాబాద్,జూలై3, బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీకి అఖిలపక్షంను తీసుకుని వెళ్లాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మరోమారు డిమాండ్ చేశారు. దీనిపై తేల్చకుండా స్థానిక ఎన్నికలను నిర్వహించ రాదని అన్నారు. బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తానన్న సీఎం ఇంకా తీసుకెళ్లలేదని విమర్శించారు. జూలై 8 లోపు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. బిసి రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి వీలు లేదని విమర్శించారు. రైల్ రోకోకు మద్దతు కోరుతూ బిఆర్ఎస్ సహా అన్ని పార్టీలకు లేఖ రాస్తామని చెప్పారు. గోదావరి- బనకచర్ల విషయంలో ప్రభుత్వం మెతక వైఖరి అవలంబిస్తోందని, ఎపి సిఎం చంద్రబాబు నాయుడును ఒక్క మాట కూడా అనలేడంలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లోని బీసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీ బిల్లు విషయంమై బీజేపీపై ఒత్తిడి తీసుకురావాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకి లేఖ రాస్తున్నామని చెప్పారు. ఈ నెల 17న బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం జాగృతి ఆధ్వర్యంలో చేపట్టనున్న రైల్ రోను విజయంతం చేయాలన్నారు. రైల్ రోకోకు సంబంధించిన పోస్టర్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైల్ రోకో కార్యక్రమానికి వివిధ పార్టీల మద్దతు కూడగట్టామన్నారు. బీసీ బిల్లుపై బీజేపీ చొరవ తీసుకోవాలని, ఈ విషయమై ఆ పార్టీ నూతన అధ్యక్షుడు రామచందర్ రావుకు లేఖ రాశామని చెప్పారు. ఆయన చొరవ తీసుకోని బీజేపీ అధ్యక్ష హోదాలో తొలి విజయం నమోదు చేసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొందేందుకే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ వస్తున్నారని విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ బీసీల కోసం పార్లమెంట్‌లో ఎన్నడూ మాట్లాడలేదని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా బీజేపీపై ఖర్గే ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ పాత లెక్కలే చెబుతున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీల వారీగా కులగణన వివరాలు బయట పెట్టాలన్నారు. జూలై 17న రైల్ రోకో నిర్వహించి తెలంగాణ నుంచి ఢిల్లీ వెళ్లే ప్రతి రైలును ఆపుతామన్నారు. బీసీ రిజర్వేషన్



బిల్లు సాధించేందుకు బీజేపీపై ఒత్తిడి తెస్తామని వెల్లడించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ పార్టీ మెతక వైఖరి కనబరుస్తున్నదని విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబును ఒక్క మాట కూడా అనలేదని ధ్వజమెత్తారు. కొందరి కాంట్రాక్టుల కోసమే బనకచర్ల ప్రాజెక్టు అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారని చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారని చెప్పారని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి బనకచర్లను ఆపాలని గట్టిగా కొట్లాడాలని చెప్పారు.

## సోనియా,రాహుల్ ను విచారించాలి...కోర్టు అనుమతి కోరిన ఈడీ



న్యూఢిల్లీ : నేషనల్ హెరాల్డ్ కేసు లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ , రాహుల్ గాంధీ లను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ, ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. యంగ్ ఇండియా కంపెనీ పేరిట అక్రమాలు జరిగాయని.. దాదాపు రూ.2 వేల కోట్ల మనీలాండరింగ్ జరిగిందంటూ ఈడీ అభియోగం మోపింది ఈ కేసులో ఇప్పటికే సోనియా, రాహుల్ సహా తదితరులపై ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అంతేకాదు.. యంగ్ ఇండియన్ సంస్థ ద్వారా అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఈ ఛార్జ్‌షీట్‌లో ఈడీ స్పష్టం చేసింది. దీని నుంచి రూ. 2,000 కోట్ల విలువైన ఆస్తులను అక్రమంగా వారు పొందారని ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే సోనియా, రాహుల్ ను విచారించేందుకు అనుమతి ఇవ్వవలసిందిగా ఈడీ అధికారులు కోరారు.

## నైజీరియన్‌ను పట్టుకుని మత్తు పదార్థాల స్వాధీనం

హైదరాబాద్,మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. తాజాగా ఆసిఫ్‌నగర్ లో భారీగా మత్తు పదార్థాలు బయటపడ్డాయి. సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు నైజీరియన్‌ను వెంబడించి పట్టుకుని అరెస్ట్ చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి పోలీసులు వెంబండించారు. ఆసిఫ్ నగర్ లోనీ ఓ అపార్ట్‌మెంట్ లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎస్ఓటీ పోలీసులు ఆసిఫ్ నగర్ లోని ఓ ప్లాట్ లో సోదాలు నిర్వహించిన పోలీసులు మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. దొరికిన మత్తు పదార్థాలను టెస్టింగ్ కు తరలించారు. మారేడుపల్లి, ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ లో ఇద్దరిపై పలు కేసులు నమోదయ్యాయి. కేటుగాళ్లు కోర్టుకు హాజరవకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

## సంపాదకీయం

**శుక్రవారం 04-07-2025**

# ఎందుకొొచ్చిన 'సర్'?!

దేశంలో ఎన్నికలు జరిగినప్పుడల్లా ఆరోపణలు రావటం, మౌనంగా ఉండిపోయి నెలలు గడిచాక ముక్తసరిగా మాట్లాడటం ఎన్నికల సంఘం(ఈసీ)కి అలవాటైపోయింది. ఈసారి మార్పేమిటంటే... ఓటర్ల జాబితా సవరణ దశలోనే దానిపై ఆరోపణలు రావటం! రాజ్యాంగంలోని 326వ అధికరణం ప్రకారం పద్దెనిమిదేళ్లు నిండిన భారతీయ పౌరులు మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకోవాలి గనుక దానికి అనుగుణంగా ఈ దఫా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు ఈసీ చెబుతోంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కింద ఓటర్ల వివరాలు సేకరిస్తామంటున్నది. ఇదే మాదిరి సవరణ 2003లో జరిగింది. కానీ ఆ 'సర్' వేరు! అప్పట్లో ఇంటింటికీ వెళ్లి జాబితాలోని ఫొటోలతో ఓటర్లను పోల్చిచూడటం, అనుమానాస్పదం అనిపిస్తే తొలగించటం వగైరాలు చేశారు. 2003 జనవరి 1ని ప్రాతిపదికగా తీసుకుని, ఆ తర్వాత జాబితాల్లోకి ఎక్కినవారందరినీ సంశయ ఓటర్లుగా పరిగణించి వారి నుంచి వివిధ పత్రాలు అడగాలన్నది ఈసీ తాజా నిర్ణయం. ఇవన్నీ 1955 నాటి జాతీయ పౌరసత్వ చిట్టా (ఎన్ఆర్సీ)లో నిర్దేశించిన పత్రాలు. సారాంశంలో ఈ ఓటర్లంతా జాబితాలో కెక్కాలంటే ముందుగా ఈ దేశ పౌరులమని నిరూపించుకోవాల్సి ఉంటుంది. తమ పుట్టుకకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు మాత్రమే కాదు... తమ తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రాలు కూడా అందజేయాలి. ప్రస్తుతం ఓటర్లను ఈసీ మూడు కేటగిరీలుగా విభజించింది. దాని ప్రకారం 1987 జూలై 1 లేదా అంతకుముందు జన్మించినవారు జనన ధ్రువీకరణ పత్రం లేదా పుట్టిన ఊరు ధ్రువీకరణ పత్రం... లేదా రెండూ సమర్పిస్తే సరిపోతుంది. జూలై 1, 1987%-% డిసెంబర్ 2, 2024 మధ్య జన్మించినవారు ఈ పత్రాలతోపాటు తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరి జనన లేదా ప్రాంత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ఆ తర్వాత జన్మించినవారు తమ ధ్రువీకరణ పత్రాలతోపాటు తల్లిదండ్రులిద్దరివీ కూడా సమర్పించాలి. ఇవి అందజేయలేనివారి పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తారు. తుది జాబితా ప్రచురణలోగా అందిస్తేనే తిరిగి చేరుస్తారు.ఎన్నికలను సక్రమంగా నిర్వర్తించటంలో తరచూ విఫలమవుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈసీ దొడ్డిదారిన ఎన్ఆర్సీని అమల్లో పెట్టజూస్తున్నదని విపక్షాలు చేస్తున్న ఆరోపణ కొట్టిపారేయదగ్గది కాదు. అలాగని దొంగ ఓటర్ల సమస్య లేదని కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో, అటు తర్వాత రెండు విభజిత రాష్ట్రాల్లో వేర్వేరు పోలింగ్ తేదీలున్నప్పుడు తెలుగుదేశం దీన్నొక కళగా అభివృద్ధి చేసింది. అక్కడా ఇక్కడా ఓటేయించటం, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి సైతం ఓటర్లను తరలించటం ఆ పార్టీకి అలవాటైన విద్య. ఇక అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వగైరాల్లో బంగ్లాదేశ్, మయన్మార్ల నుంచి వచ్చినవారు ఓటర్లుగా నమోదై ఎన్నికల ఫలితాలు తారుమారు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే అందుకు సంబంధించిన డేటా ఈసీ ఇంతవరకూ బయటపెట్టలేదు. అది విడుదల చేసివుంటే ఈ వ్యవహారం ఇంత వివాదం అయివుండేది కాదు. కానీ అలా చేయటం తన స్థాయికి తగదని సంస్థ భావిస్తున్నట్టుంది. బిహార్ మాత్రమే కాదు... వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కూడా ఈ 'సర్' వచ్చిపడుతుందంటున్నారు. ఏడేళ్ల క్రితం అస్సాంలో ఈ దేశ పౌరులెందరు... ఇతరులెందరన్న ఆరా తీశారు. భారత రిజిస్ట్రార్ జనరల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్వే తర్వాత 40.07 లక్షల మంది 'విదేశీయులని' నిర్ధారించారు. ఎన్నో ఆందోళనలు జరిగాక ఈ సంఖ్య 19 లక్షలకు తగ్గింది. వీరిలో అన్ని మతాలవారూ ఉండగా బిచ్చగాళు , నిరుద్యోగులూ, ఇల్లూ వాకిలీ లేనివారూ ఎక్కువ. ఒక ఇంట్లో పెద్దన్న 'భారతీయుడైతే' మిగిలిన అన్నదమ్ములు 'విదేశీయులు'గా ముద్రపడిన వారున్నారు. భర్తకు ఎన్ఆర్సీలో చోటు దక్కితే భార్య పేరు గల్లంతయిన ఉదంతాలు కోకొల్లలు. సైన్యంలో రిటైరై, అస్సాం సరిహద్దు పోలీసు విభాగంలో సబ్ఇన్స్పెక్టర్గా పనిచేసే మహమ్మద్ సనావుల్లా పేరు సైతం మాయమైతే అరెస్టు చేసి నిర్బంధ శిబిరానికి తరలించారు. జాబితాలో ఉన్న కుటుంబ సభ్యులంతా గువాహటి హైకోర్టును ఆశ్రయించాక బెయిల్ దొరికింది. ఆ రాష్ట్రంలో ఏడేళ్లయినా ఇప్పటికీ లక్షల కేసులు తేలని నేపథ్యంలో ఇంత పని ఈసీ ఎందుకు నెత్తికెందుకుందన్న ప్రశ్న అందరినీ వేధిస్తోంది. బిహార్లో ఇప్పుడున్న ఓటర్ల సంఖ్య 7 కోట్ల 90 లక్షలు. ఇందులో 20%-%38 ఏళ్ల మధ్య వయస్కులు దాదాపు సగమని చెబుతున్నారు. ఈసీ లెక్క ప్రకారం ఈ సంఖ్య 2.93 కోట్లు. వీరు తమతోపాటు తమ తల్లిదండ్రుల్లో కనీసం ఒకరి పౌరసత్వాన్ని తేల్చిచెప్పాల్సి ఉంటుంది. నాలుగు నెలల్లో ఎన్నికలు పూర్తయి ప్రభుత్వం ఏర్పడాల్సిన బిహార్లో ఇది అంత తేలిగ్గా తేలే వ్యవహారమా? ఆ వంకన పాలక పక్షాల ఒత్తిడితో భారీయెత్తున ఓటర్లను తొలగించే ప్రమాదం ఉండదా? జాబితాలో చోటుదక్కనివారు న్యాయస్థానాలకెక్కితే పరిస్థితేమిటి? పాలకులుగా ఎవరున్నా పేదరికం రాజ్యమేలే బిహార్ నుంచి భారీయెత్తున వలసలుంటాయి. అక్కడ వృద్ధాప్య పింఛన్ నెలకు రూ. 700. ఇటీవలే దాన్ని రూ. 1,100 చేస్తున్నట్టు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆర్భాటంగా ప్రకటించారు. పనుల కోసం వందలాది కిలోమీటర్లు దాటి తెలుగు రాష్ట్రాలకు వలస వస్తున్నవారి సంఖ్య తక్కువేమీ కాదు. అక్కడి జనాభాలో 7 శాతం మంది వేరే రాష్ట్రాలకు పోగా, అందులో 30 శాతం మంది ఉపాధి వెదుక్కొని వెళ్లినవారే. వారంతా వెనక్కొచ్చి తమ పత్రాల కోసం వెతుకులాడటం జరిగే పనేనా?

# సవాళ్లను అధిగమిస్తేనే సత్తా తేలేది!



హైదరాబాద్,తెలంగాణలో భారతీయ జనతా పార్టీ కొత్త అధ్యక్షుడి ఎంపిక/ ఎన్నికపై పార్టీలో మిశ్రమ స్పందన వ్యక్తమౌతోంది. రాష్ట్రాధ్యక్షుడిని ఖరారు చేయడంలో నాయకత్వం అనుస రించిన పంథా, పెట్టుకున్న ప్రాతిపదికపై విమర్శలు, ప్రశంసలు. రెండూ ఉన్నాయి, 'తూటా లేని తుపాకీతో యుద్ధానికి సిద్ధమైంద'ని కొందరంటే, 'గ్రూపుల మాయలో పడకుండా సిద్ధాంత నిబద్ధత చాటింది' అని మరికొంద రు%ౌ% ఇలా పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారు. కొత్త అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావుకు మాత్రం రాబోయే రోజులు కత్తి మీద సాము! స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక ప్రధాన సవాల్!బిసిని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించి, బ్రాహ్మణ అగ్రవర్ణపు వ్యక్తికి పార్టీ పగ్గాలిచ్చిన పరిస్థితుల్లో%ౌ% సామాజిక వర్గాల్ని సమన్వయపరిచి, పార్టీని నడిపించడం మరో సవాల్! బిజెపినే అంటిపెట్టుకున్న పాత నాయకులకు %-% బయట్నించి వచ్చి పార్టీకి దన్నుగా ఉంటున్న ఇతర నాయకుల మధ్య సఖ్యత కూర్చడం కూడా సవాలే! వాటిని ఆయన ఎలా ఎదుర్కొంటారు? అధ్యక్ష స్థానం ఆశించి భంగపోయిన వారి సహకారమెంత? ఆయన్ని అడ్డుపెట్టుకొని 'రిమోట్ కంట్రోల్' తో వ్యవహారం నడుపాలనుకుంటున్న వారికి ఏ మేర లొంగుతారు? ఇవన్నీ ఇపుడు ఆసక్తి రేకెత్తించే అంశాలే!చాన్నాళ్ల నిరీక్షణ తర్వాత బిజెపి రాష్ట్రాధ్యక్షుడి ఎన్నిక జరిగింది. విద్యార్థి దశ నుంచి బిజెపి అనుబంధ విభాగాల్లో పనిచేస్తూ సుదీర్ఘ అనుభవం గడించిన మాజీ ఎంఎల్సి ఎన్. రాంచందర్ రావు తాజాగా అధ్యక్షుడయ్యారు. ఆయనది దూసుకుపోయే స్వభావం కాదని, మెతక అని, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన తరుణంలో ఇది సరైన నిర్ణయం కాదని పార్టీలో కొందరు అభిప్రాయపడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సమీకరణాల్ని, రాజకీయ పరిస్థితుల్ని అర్థం చేసుకోవడంలో బిజెపి కేంద్ర నాయకత్వం ఎప్పుడూ విఫలమవుతోందనేది వారి భావన. మాజీమంత్రి ఈటల రాజేందర్ కో, కేంద్ర మంత్రి బండి సంజయ్ కో, మహిళా నాయకురాలు డి.కె. అరుణ కో పార్టీ పగ్గాలు ఇచ్చి ఒక ప్రయోగం చేసి ఉండాల్సిందని పార్టీలోని ఒక వర్గం భావిస్తోంది. ఈ వరుసలో ఇతర ఎంపిలు అర్వింద్ (నిజామాబాద్), రఘునందన్ రావు (మెదక్) పేర్లు కూడా వినిపించాయి. రాష్ట్రంలో బిఆర్ఎస్ బలహీనపడి ఉన్న పరిస్థితుల్లో సదరు రాజకీయ శూన్యతలోకి బిజెపి విస్తరించేందుకున్న అవకాశాల్ని పదునుగా వాడుకోవాల్సిందనే వారి వాదన ఇది. వేర్వేరు కారణాల వల్ల ఇతరులెవరినీ ఎంపిక చేయని ఢిల్లీ అధిష్ఠానం చివరకు రాంచందర్ రావు వైపు మొగ్గింది.

### బోధపడని పార్టీ వ్యూహం

రాష్ట్రాల్లో పార్టీని నడిపే నాయకత్వం విషయంలో యుద్ధ సమయం, శాంతి సమయం అని రెండు పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకోవడం బిజెపి పెద్దలకు అలవాటు. మరి, తెలంగాణలో ప్రస్తుత సమయాన్ని వారేమైనా 'శాంతి సమయం'గా పరిగణించారా? యుద్ధ సమయానికి ఇంకో అధ్యక్షుడెవరైనా వస్తారా? ఇటువంటి సందేహాలు కూడా పార్టీ శ్రేణుల్లో ఉన్నాయి. దూకుడు స్వభావం ఉన్నవారికి పగ్గాలిస్తే, రేపు ఎన్నికలప్పుడు బిఆర్ఎస్ వంటి కాంగ్రెసేతర ప్రాంతీయశక్తితో చేతులు కలపాల్సిన పరిస్థితే వస్తే ఇబ్బందనే ముందుచూపుతోనే అధినాయకత్వం ఇలా వ్యవహరించిందా?ఇవన్నీ ప్రశ్నలే ప్రస్తుతానికి. యోగ్యత, ఖర్చు భరించడం, విజయావకాశాలు వంటివి పరిశీలించి టిక్కెట్లివ్వడం, పార్టీ అధికారంలోకి వస్తే పదవులివ్వటం తప్ప సంస్థాగత హోదాలు, నాయకత్వ పగ్గాలు బయటి నుంచి వచ్చిన వారికి ఇవ్వకపోవడమే మంచిదని బలంగా భావించే వర్గమొకటి బిజెపిలో ఉంది. అధినాయకత్వం అలానే భావించి తాజా నిర్ణయం తీసుకొని ఉంటుందని వారు అన్వయించి చెబుతున్నారు.ఇది నిజానికి పార్టీ పాతతరం నాయకుల వాదన. ఒక దశలో ఈటల రాజేందర్ పై అధినాయకత్వానికి గురి కుదిరినా అధ్యక్షపీఠం ఇవ్వకపోవడం ఇలాంటి ఊహలకు ఆస్కారమిస్తోంది. పార్టీలో 'చేరికల కమిటీ' ఏర్పరచి, ఆ బాధ్యత అప్పగించినా ఈటల వల్ల పార్టీకి పెద్దగా ఉపయోగమేమీ జరుగలేదనే భావన అధిష్ఠానానికి ఉందంటున్నారు. గజ్వేల్లోనే కాకుండా హుజూరాబాద్లోనూ ఓడిపోవడం, బిజెపి సంస్థాగత నిబంధనావళిలోని షరతులు ప్రతికూలంగా ఉ ండటం ఆయనకు కలిసిరాని అంశాలు. 'ఏమైతేనేం మంచి నిర్ణయమే జరిగింది, పార్టీలోనే పుట్టి–పెరిగి, పార్టీకోసం అవిశ్రాంతంగా పనిచేసే వారికి నాయకత్వ పగ్గాలు ఇవ్వటమే సరైంది' అని వాదించే వారున్నారు.

### ఎం –త్రీ ని ఎలా ఏకం చేస్తారో?

తమను గెలిపిస్తే బిసి వ్యక్తిని ముఖ్యమంత్రి చేస్తామని పార్టీ నాయకత్వం పోయినసారి ఎన్నికల ముందే ప్రకటించింది. ఆ రాజకీయ అగ్గి పార్టీలో క్రమంగా రాజుకుంది. అది అప్పటి ఎన్నికల్లో పెద్ద ప్రభావం చూపకపోయినా, రానురాను బిజెపి బిసి వర్గాల్లో ఆకాంక్షలు, అంచనాలు పెరగటానికి కారణమయింది. 'నిజంగానే బిసి ని ముఖ్యమంత్రిని చేస్తే మా అవకాశాలెంత?' అనే లెక్కలు పార్టీ సీనియర్లలో అప్పట్లోనే మొదలయ్యాయి. పార్టీ బిసిల్లో మున్నూరుకాపు, ముదిరాజ్ సామాజికవర్గాల నాయకుల్లో, ముఖ్యంగా యువతలో దూకుడు పెరిగింది. అదే క్రమంలో ఆయా వర్గాలకే చెందిన ముఖ్య నేతలు కేంద్రమంత్రి బండి సంజయ్, అర్వింద్ లతోపాటు బిఆర్ఎస్ నుంచి బిజెపిలోకి మారిన ఈటల రాజేందర్ లలో క్రియాశీలత పెరిగినట్టు పార్టీలో కొందరు విశ్లేషిస్తారు. రెడ్డి సామాజిక వర్గం నుంచి అధ్యక్ష బాధ్యతలు, బ్రాహ్మణ సామాజిక వర్గానికి మారటాన్ని 'బిసి'లకు జరిగిన మోసంగా కొందరు ప్రచారం ప్రారంభించారు.పార్టీ అధ్యక్షుడే సిఎం కావాలని ఏముంది? పార్టీకి రేపు ప్రజలు పట్టం కట్టి, ప్రభుత్వం ఏర్పరిచే పరిస్థితే వస్తే, అధ్యక్షుడు ఒసి ఉండి, ముఖ్యమంత్రి బిసి ఉండకూడదని ఎక్కడుంది? అని ప్రశ్నించే వారూ ఉన్నారు, రాష్ట్రాధ్యక్షుడిగా రాంచందర్ ఎన్నికవడానికి చాలా ముందుగానే 'ఎం– త్రీ' ఫార్ములాను పార్టీ నాయకత్వం ముందుకు తెచ్చింది. సామాజిక సమీకరణాల్లో భాగంగా 'మున్నూరు కాపు, ముదిరాజ్, మాదిగ' వర్గాలను మచ్చిక చేసుకొని, పార్టీ ఒడిలోకి తెచ్చుకుంటే, వారు బహుళ సంఖ్యాకులైనందున బలపడతామనేది వ్యూహకర్తల ఆలోచన. ఎంఆర్పిఎస్ నేత మందకృష్ణ మాదిగను పక్కన కూర్చోబెట్టుకొని, పార్టీ అగ్రనేత అయిన దేశ ప్రధాని మోడీ స్వయంగా ఎస్సి వర్గీకరణకు నిర్దిష్టంగా హామీ ఇవ్వటం, తదనంతర పరిణామాల్లో సుప్రీంకోర్టు సానుకూల తీర్పు, కేంద్ర విధానం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టం తెచ్చి వర్గీకరణ చేయడం%ౌ% వంటివి చకచకా జరిగిపోయాయి. మందకృష్ణకు 'పద్మశ్రీ' పురస్కారమూ లభించింది. ఇప్పుడీ వివిధ సామాజిక వర్గాలను సమన్వయం చేసి, పార్టీకి రాజకీయ లబ్ధి చేకూర్చాల్సిన బాధ్యత కొత్త అధ్యక్షుడి భుజాల మీదుంది.

# జిఎస్టీ బాదుడుపై నోరు మెదపని చంద్రబాబు

న్యూఢిల్లీ,జిఎస్టీ ఏ ముహూర్తాన వచ్చి చేరిందో కానీ ప్రజల నడ్డి విరుస్తోంది. ఎంతగా అంటే ఏది కొన్నా దానిపై అధిక మోతాదులో పన్నులకే సరిపోతోంది. చివరకు మనం ఆరోగ్యం కోసం తీసుకున్న ఇన్సూరెన్స్, సేవింగ్స్ కోసం తీసుకున్న జీవితభీమాలపైనా జిఎస్టీ తప్పడం లేదు. 12 నుంచి 18శాతం ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఎన్డిఎ కూటమిలో ఉన్న టిడిపి, నితీశ్ కుమార్ పార్టీలతో సహా ఇతర చిల్లర పార్టీలు కూడా దీనిపై మోడీని నిలదీయడం లేదు. ప్రజలు పడుతున్న బాధలకన్నా ఆదాయం సమకూరడమే వారికి ముఖ్యమయ్యింది. ఎందుకంటే జిఎస్టీ ఎంత వసూలు అయితే అందులో సగం రాష్ట్రాలకు వెళుతుంది. దీంతో పెన్షన్లు, కిలో రూపాయి బియ్యం ఇవ్వడం వంటివి అలవాటు చేసుకున్నారు. పెన్షన్ల పంపిణీకి స్వయంగా సిఎం చంద్రబాబు వెళ్లడం, పెద్దపెద్ద మీటింగ్లు పెట్టడం, చెక్కులు అందించడం దారుణం కాక మరోటి కాదు. ప్రతినెలా ఇవి ఖాతాల్లో నమోదు అవుతాయి. వీటికోసం హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాలు వేసుకుని వెళ్లి చెక్కులు అందించడం దుబారా ఖర్చు కాక మరోటి కాదు. ఇంతగా దుబారా జరుగుతున్న ఎవ్వరూ నిలదీయడం లేదు. దుబారా పథకాలతో ఓట్లు దండుకునే ఎత్తులు తప్ప రాజకీయ నాయకులకు దేశం, రాష్ట్ర, ప్రజల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేకుండా పోయింది. దుబారాలపై పరస్పరం విమర్శలు చేసుకోవడం ఫ్యాషన్గా మారింది. ఇకపోతే క్వాంటమ్, పోలవరం, అమరావతి గురించి మాట్లాడుతున్న చంద్రబాబు జిఎస్టీ వడ్డింపులపై మాట్లాడడం లేదు. ఎందుకంటే మోడీకి కోపం తెప్పించే ఏ పనీచేయక పోవడమే ఉత్తమమని భావిస్తున్నారు. గతంలో మోడీతో పెట్టుకుని ఐదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న అనుభవం ఉంది. ఇకపోతే తాజా గాణాంకాల మేరకు రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు పెరిగాయి. ఈ ఏడాది జూన్లో రూ. 2,591 కోట్ల నికర జీఎస్టీ వసూలైంది. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జూన్ నెలకు ఇదే అత్యధికం. 2025–26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మొత్తం వసూలైన నికర జీఎస్టీ రూ. 8,860 కోట్లు. గతేడాది జూన్లో వచ్చిన రూ. 3,910 కోట్ల పన్ను ఆదాయం కంటే ఇది 6.58 శాతం ఎక్కువ. ఈ ఏడాది జూన్లో ఐజీఎస్టీ సెటిల్మెంట్ రూ. 1,365 కోట్లు వచ్చింది. వృత్తి పన్ను రూ. 29 కోట్ల నుంచి రూ. 49 కోట్లకు పెరిగింది. లిక్కర్పై వ్యాట్ రూ. 61 కోట్ల నుంచి రూ. 86 కోట్లకు, పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ రూ. 1,380 కోట్ల నుంచి రూ. 1,435 కోట్లకు పెరిగింది. ఇవన్నీ బాబు లాంటి వారికి ఆనందం కలిగించేవే. ఎందుకంటే ఆదాయం వస్తే తమ వాటా కూడా వస్తుందన్న ఆనందం. అందుకే బాబు జిఎస్టీపై నోరు మోఎదపడం లేదు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాట్ స్థానంలో జీఎస్టీ పన్ను విధానాన్ని తీసుకొొచ్చిన సంగతి తెలిసిందే. ఇది ప్రభుత్వానికి ఆదాయం పెరగటానికి తోడ్పడింది. గత పార్లమెంట్ సమావేశాల్లో ఇన్సూరెన్స్పై జిఎస్టీ తగ్గించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కోరినా నిర్మలా సీతారామన్ ఈసడించుకున్నారు. నిజానికి ప్రజల సమస్యలను తెలుసుకునే బదులు ఎదురుదాడి చేశారు. అయితే ప్రస్తుతం మధ్యతరగతి భారతీయులకు అనుగుణంగా పన్ను రేట్లలో తగ్గింపును అందించ బోతున్నట్లు వెల్లడైంది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం అనేక వస్తువుల ధరలను అధిక జీఎస్టీ బ్రాకెట్ నుంచి తక్కువ పన్నులకు మార్చాలని కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు వెల్లడైంది. ఇదే నిజమైతే దీనిపై చర్చ చేయాలి. ఏయే రంగాల్లో ప్రజలు బాధపడుతున్నారో గుర్తించాలి. రాష్ట్రాల సిఎంలతో చర్చించాలి.




అయితే ప్రస్తుతం మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ఆదాయం కలిగిన ప్రజల కోసం జీఎస్టీ పన్నుల విషయంలో కూడా పెద్ద మార్పులకు కేంద్రం శ్రీకారం చుడుతోందని సమాచారం. దీనికింద 12 శాతం కింద ఉన్న అనేక వస్తువులపై పన్నును 5 శాతానికి తగ్గించనున్నట్లు వెల్లడైంది. నిజంగా ఇలాంటి ఆలోచన ఉంటే అనేక రంగాలపై పన్ను శాతాన్ని అత్యదికంగా 5శాతానికి తగ్గిస్తే మేలు. ఇకపోతే పన్నుల్లో హేతుబద్దత లేకపోవడం వల్ల చిన్న,మధ్యతరగి ప్రజలు, కంపెనీలు జిఎస్టీ కట్టుకోలేక దివాళా తీస్తున్నారు. వస్తువలపై డబుల్ డబుల్ పన్నులు పడుతున్నాయి. ఉప్పులు, పప్పులపై జిఎస్టీ పద్దాక కూడా ఇడ్లీ దోశలపై పన్నులు వాయిస్తున్నారు. మధ్యతరగతి ప్రజలు హోటల్కు వెళ్లి టిఫిన్ చేయలేని దుస్థితి నెలకొంది. దేశంలో నిరుద్యోగ తీవ్రత చాలా ఎక్కువగా వుంది. దేశంలో పని చేయగలిగిన శ్రామికుల సంఖ్య 64 శాతానికి పెరిగిందని, కేవలం 37 శాతం మందికి మాత్రమే పనులు దొరికాయని ఓ నివేదిక తెలిపింది. యువతకు ఉపాధి కల్పించడం దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్గా మారింది. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ ప్రభావంతో నిరుద్యోగం మరింత తీవ్రం కానుంది. ఐటి సేవల రంగాలలో తక్కువ నైపుణ్యం ఉంటే చాలన్న రీతిలో సాగుతోంది. ఐటి కంపెనీలు కూడా ఉద్యోగులను ఉన్న పళంగా తీసేస్తున్నాయి. ప్రధాని మోడీ చెబుతున్నట్లుగా 2047 నాటికి దేశం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే విద్యారంగం, వ్యవసాయరంగం కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. అత్యధిక అక్షరాస్యత వున్న కేరళ తలసరి ఆదాయం దేశంలో మొదటి స్థానంలో వుంది. తర్వాత స్థానాల్లో తమిళనాడు, తెలంగాణ వున్నాయి. బీహార్ తలసరి ఆదాయం అతి తక్కువగా వుండడానికి అక్షరాస్యత కూడా ముఖ్య కారణమన్నారు. ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, గ్రామీణాభివృద్ధి రంగాలన్నింటికి నిధుల కేటాయింపులు తగ్గిపోతున్నాయి. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా నినాదాలను రాజకీయ ప్రచారం కోసం వాడుకుంటున్నారు. ప్రపంచీకరణ ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ సేవలు కుదించుకుపోయాయి. పేద, మధ్య తరగతి వారికి వచ్చే అరకొర ఆదాయం నుండి విద్య, వైద్యానికి చేసే ఖర్చులు పెరిగిపోయాయి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. వీటిపై పన్నులు అంటే జిఎస్టీ వసూళ్లు దారుణంగా ఉన్నాయి. ఆర్థిక అంతరాలను తగ్గించడానికి సంపన్నుల మీద పన్నులు వేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. పేదరికం లేని సమాజం కోసం ప్రణాళికలు అమలు చేయడం లేదు.

# అమ్రాబాద్ టైగర్ ఫారెస్ట్ మూసివేత

నాగర్కర్నూలు,పెద్ద పులులు, అరుదైన వన్య ప్రాణుల ఆరోగ్య భద్రతా, సంతానవృద్ధి, సంతానోత్పత్తి పక్రియల దృష్ట్యా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ను మూడు నెలల పాటు రాష్ట్ర అటవీ శాఖ వన్యప్రాణి సంరక్షణ విభాగం మూసివేస్తున్నట్లు ప్రకటించింది. పర్యాటకులను ఆకట్టుకునే అమ్రాబాద్ టైగర్ రిజర్వ్లో సందర్శకుల కోసం జంగిల్ ట్రిప్, వీక్షణ ప్రదేశాల వంటి సందర్శన ప్రాంతాలు జూను 30 వరకు అందుబాటులో ఉన్నాయి. తాజాగా జాతీయ పెద్దపుల సంరక్షణ అథారిటీ (ఎన్టిసిఎ) మార్గదర్శకాలకు అనుగుణంగా పులులతో పాటు ఇతర వన్యప్రాణుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు జూపార్క్ డైరెక్టర్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ , అటవీశాఖ అచ్చంపేట సర్కిల్ కన్జర్వేటర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరేమంత్ తెలిపారు.ప్రతి ఏడాది వర్షాలంలో టైగర్ రిజర్వ్లో పెద్దపులు, ఇతర వన్యప్రాణులు వర్షాల కారణంగా తడిసిన నేలల్లో ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తల్లో భాగంగా వాటికి ఇతరాత్ర అలికిడి ఉండని విధంగా సిబ్బందితో పాటు సందర్శకులను కజ్జర్వేషన్ జోన్లోకి అనుమతించరు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా జూలై 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్లోని ఫర్హాబాద్ వ్యూ పాయింట్, అక్టోపస్ వ్యూ పాయింట్లు మూసి వేస్తున్నట్లు ఫీల్డ్ డైరెక్టర్ వెల్లడించారు. వన్యప్రాణుల పరిరక్షణ ప్రయత్నాలు సులభతరం చేయడంతో పాటు వ్యాధు వ్యాప్తిని నివారించేందు ఈ మూడు నెలల కాలం ఎంతో కీలకం. దాంతో టైగర్ రిజర్వ్లోకి పర్యాటకులను అనుమతించరు. పెద్ద పులుల సంతోనోత్పత్తి ఎ÷–లాన్ (టిసిపి) ప్రకారం పర్యావరణ వ్యవస్థ, వన్యప్రాణుల సంరక్షణ నిర్వహించడానికి టైగర్ జోన్ మూసివేత దోహదపడుతుంది. అంశాన్ని పర్యాటకులు, వన్యప్రాణి ఔత్సాహికులు గ్రహించి సహకరించాలని అధికారులు కోరుతున్నారు. పర్యాటకులతోపాటు ఇతరులు ఎవరూ కూడా ఆంక్షలు అమలులో ఉన్న పెద్దపులుల సంరక్షణ ప్రదేశాల వద్ద నిబంధనలు ఉల్లగించి కనిపిస్తే సహించేది లేదని ఫీల్డ్ డైరెక్టర్ హెచ్చరించారు. కాగా, వర్షా కాలంలో వన్యప్రాణులు సంతానోత్పత్తి చేసి పుట్టిన పిల్లలను సంరక్షించుకునేందు ప్రశాతం వాతావరణం కోరుకుంటాయి. పలు రకాల వన్యప్రాణులు సంతానోత్పత్తి పక్రియకు ఆడ, మగ జంతువులు జత కట్టె అనుకూల కాలం కూడా ఈ మూడు నెలలలో అధికంగా ఉంటుంది. వేసవి కారణంగా ఎండిన అటవీ ప్రాంతం వర్షాలు కురుస్తుండడంతో తిరిగి సమతుల్యతను పెంచుకునే వీలు ఉంటుంది.

# కిషన్ మార్క్ కార్పొరేటీకరణ దిశగా బీజేపీ?

హైదరాబాద్,గంగ పూర్తిగా చంద్రముఖిగా మారిందని ఒక సినిమా డైలాగ్. తెలంగాణ బీజేపీ కూడా అలా కాషాయీకరణ నుంచి కిషన్ రెడ్డీకరణ చెందినట్టేనా? ఆయన్ను వ్యతిరేకించిన వారు, ఆయన గుట్టు రట్టు చేసిన వారి జాడే లేకుండా పోతుందా? అన్న చర్చకు తెరలేచింది. ఇప్పుడందరి మాట ఏంటంటే గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా ఆయనకేం పెద్దగా నష్టం కలిగించదు. ఎందుకంటే ఆయన ఇప్పుడు ఆ నియోజకవర్గంలో బీజేపీని మించి పోయారు. బీజేపీ హవా లేకున్నా గెలుస్తారు. ఉన్నా గెలుస్తారు. ఆయన ఇండిపెండెంట్ గా గెలుస్తారు. పార్టీ టికెట్ మీదా గెలుస్తారు. ఇప్పుడాయన రెండు తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అవసరం లేని హిందుత్వ బ్రాండ్ గా రూపాంతరం చెందారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పుడు సమస్య అంతా ఏంటంటే రాజా సింగ్ తెలంగాణ బీజేపీకి ఒరిజినల్ సీడ్. కిషన్ రెడ్డయినా అంబర్ పేట్ లో ఓడిపోతారేమోగానీ.. ఆయన మాత్రం తన సెగ్మెంట్లో అస్సలు ఓడరు. అంతటి సాలిడ్ ఓటు బ్యాంకు రాజాసింగ్ సొంతం. అలాంటి రాజాసింగ్ అంటే సిసలైన కాషాయ సైనికుడు. బీజేపీ దాని పొలిటికల్ డైనమిక్స్ ని ఆయన ఎప్పుడో దాటి పోయారన్న పేరుంది. ఒక రకంగా చెబితే బీజేపీలో మరే సాధారణ నేత కూడా కామెంట్ చేయలేని ఎన్నో అంశాలపై ఆయన సంచలన కామెంట్లు చేసి సస్పెండ్ అయిన పరిస్థితులున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఓల్డ్ సిటీలో ఎంఐఎంని ఢీ కొట్టగలిగే వారే లేరు. కానీ ఎంఐఎంని దాని విధానాలను తూర్పార పట్టగల ఒకే ఒక్కడుగా రాజాసింగ్ తనదైన గుర్తింపు పొందారు.అలాంటి రాజాసింగ్ లేని బీజేపీ నేతి బీరకాయలో నెయ్యి అన్న చందంగా కాషాయంలేని కాషాయ పార్టీగా బీజేపీ మిగిలిపోతుందని అంటున్నారు. ఇప్పుడు అక్కడున్న ఎమ్మెల్యే, ఎంపీల్లోనూ చాలా మందిది బేసిగ్గా ఈ పార్టీ కానే కాదు. హిందుత్వ భావజాలం అసలే లేదు. మరీ ముఖ్యంగా ఈటల, డీకే అరుణ, కొండా విశ్వేశ్వరరెడ్డి వంటి వారు వేరే వేరే పార్టీల నుంచి కమలం గూటికి చేరారు. మరీ ముఖ్యంగా ఈటల విషయమే తీసుకుంటే ఆయన వామపక్ష సానుభూతి పరుడిగా గుర్తింపు పొందారు. ఇప్పుడు బీజేపీ శ్రేణులే ఆయనను బీఆర్ఎస్ కోవర్టుగా అభివర్ణిస్తున్నారు. కాళేశ్వరం అంశంలో బీఆర్ఎస్ ఇంతగా విచారణ ఎదుర్కుంటుండగా.. ఆయన కూడా హాజరైన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ కు కేసీఆర్ కు అనుకూలంగా మాట్లాడారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే.. ప్రస్తుతం బీజేపీలో ఉన్న వారిలో చాలా మంది మూలాలు ఆర్ఎస్ఎస్ భావజాలం కాదు. కేవలం రాజకీయ అనివార్యత వల్లనే కమలం గూటికి చేరిన వారి సంఖ్యే ఎక్కువగా ఉంది. అలాంటి పార్టీలో ద ఒరిజినల్ కాషాయ రక్తం బయటకు వెళ్లడం అంటే ఆ పార్టీ మూల సిద్ధాంతం మరుగున పడ్డ పరిస్థితులున్నట్టుగానే భావించాలని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.దీనంతటి వెనక కిషన్ రెడ్డి ఉన్నట్టుగా పార్టీ వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది. బేసిగ్గా కిషన్ రెడ్డి గురించి రాజా సింగ్ గతంలో అధికారంలో ఎవరుంటే వారితో కిషన్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతారని.. ఉగ్రవాదం మీద పోరు చేస్తూనే ఉగ్రవాదులతో కలసి వ్యాపారాలు చేసే అమెరికన్ ప్రెసిడెంట్లకన్నా పెద్ద ప్రమాదకారి అనీ ఆరోపణలు, విమర్శలూ చేసిన సంగతి తెలిసిందే. అలాంటి కిషన్ రెడ్డి ఆడమన్నట్లు పార్టీ అధిష్టానం ఆడుతోందనీ.. కారణం ఆయన కేంద్ర అధిష్టాన పెద్దలకు అత్యంత దగ్గరి వాడు కావడమేననీ, అందుకనే సాధారణ కార్యకర్తకు పార్టీలో చోటు దక్కకుండా పోతోందనీ.. తెలంగాణలో ప్రస్తుత ఇది ఒకప్పటి కాషాయ పార్టీ కాదని.. పూర్తి కిషన్ మార్క్ కమర్షియల్ వర్షన్ అని రాజాసింగ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పైకి చెప్పకపోయినా తొలి నుంచీ బీజేపీలో ఉన్నవారు అంతర్గత సంభాషణల్లో రాజాసింగ్ తో ఏకీభవిస్తున్నారు. ఇక రాజాసింగ్ క్రమశిక్షణ గీత దాటారంటూ రాణి రుద్రమ వంటి చోటా మోటా లీడర్ల వివరణలను పార్టీలో పదవుల వెంపర్లాట కొద్దీ చేస్తున్నవిగా కొట్టి పారేస్తున్నారు రాజాసింగ్ మద్దతుదారులు.

# లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జిహెచ్ఎంసి ఉద్యోగి

హైదరాబాద్,లంచం తీసుకుంటుండగా జిహెచ్ఎంసి మూసాపేట్, సీనియర్ అసిస్టెంట్ను ఎసిబి అధికారులు రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఎసిబి అధికారుల కథనం ప్రకారం జిహెచ్ఎంసి, మూసాపేట్ సర్కిల్ 23లో, ఎం.సునీత సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తోంది. బాధితుడి తల్లి పేరుపై ఉన్న ఆస్తిని తన పేరుపై మార్చి మ్యూటేషన్ చేయాలని ప్రాపర్టీ ట్యాక్స్ విభాగంలో పనిచేస్తున్న సునీతను సంప్రదించాడు.ఈ పనిచేసేందుకు సునీత రూ. 80,000 లంచం డిమాండ్ చేసింది.పలుమార్లు కలిసి బతిమిలాడగా, చివరకు రూ. 30,000లకు చేస్తానని, అంతకంటే తక్కువకు చేయనని చెప్పింది.

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం

అమరావతి,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పేరుతో అనేక ప్రాజెక్టులను ఏకకాలంలో చేపట్టి అవి కాంట్రాక్టర్లకు, రాజకీయ నాయకులకు ధనయజ్ఞం లాగా మారిన వైనం చూసాం. అలాగే 2014-15 నుండి 2018-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం పోలవరంతో కలిపి 56 సాగునీటి ప్రాజెక్టులను రూ.80,792 కోట్లతో పూర్తి చేస్తామని చెప్పి వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిచేయలేదు. గత వైసిపి ప్రభుత్వం కొత్తగా మరో 37 ప్రాజెక్టులను ఒకేసారి ప్రారంభించి 4 సంవత్సరాల్లో పూర్తిచేస్తామని ప్రకటించి రూ.61,573.15 కేటాయించి, అందులో రూ.32,059,61 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. రాష్ట్రంలో పెండింగ్‌లో వున్న లేదా నిర్మాణంలో వున్న ప్రాజెక్టులు పూర్తయితే భారీ ప్రాజెక్టుల ద్వారా 580.692 టిఎంసీల నీటితో 50,95,394 ఎకరాలు, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 25.111 టిఎంసీల నీటితో 2,82,238 ఎకరాలు, చిన్నతరహా ప్రాజెక్టుల ద్వారా 3.742 టిఎంసీల నీటితో 58,052 ఎకరాలు మొత్తం 54,35,684 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా బనకచర్ల ప్రాజెక్టు గురించి అధికార పార్టీ మాట్లాడినా, ప్రతిపక్షం ప్రశ్నించకపోయినా ప్రజలు ప్రశ్నించాలి. కేంద్రం ఆరా తీయాలి. ఎందుకంటే ఇది సాధ్యమా కాదా అన్నది ముందు తేల్చాలి. కెసిఆర్ లాగా చంద్రబాబు చేస్తానంటూ చూస్తూ ఊరుకోరాదు. బనకచర్ల ప్రాజెక్టును మూడు దశల్లో నిర్మించాలని నిర్ణయించినట్లు సిఎం చంద్రబాబు చెబుతున్నారు. మొదటి దశలో ప్రస్తుతం వున్న పోలవరం కుడి కాలువ సామర్థ్యాన్ని 17,500 నుండి 38,000 క్యూసెక్కులకు పెంచుతారు. పోలవరం ఎత్తును 45.72 మీటర్ల నుండి 41.15 మీటర్ల ఎత్తుకు కుదిస్తూ కేంద్ర కేబినెట్ గత ఆగస్టులో తీర్మానించింది. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించలేదు. 41 మీటర్ల వరకే నీరు వుంటే 42 మీటర్ల నుంచి బనకచర్ల ప్రాజెక్టుకు నీరు తరలిస్తామనడం ఎలా సాధ్యం? అలాగే రెండో దశలో కొత్తగా పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లి దగ్గర 150 టిఎంసీల నీటిని నిల్వ చేసే రిజర్వాయర్ నిర్మించాలి. దీనివల్ల బొల్లాపల్లి మండలంలో 15 గ్రామాలు నీటి మునుగుతాయి. వీరికి పునరావాసం కల్పించాలి. రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకే ఇప్పటికీ పరిహారం, మౌలిక సౌకర్యాలు కల్పించక పోవడంతో వారు పోరాడుతున్నారు. కొత్తగా ఈ 15 గ్రామాల పునరావాసం ఎప్పటికి తీరుతుందన్నది ప్రశ్నార్థకంగా ఉంది. మూడో దశలో బొల్లాపల్లి రిజర్వాయర్‌లో 172 మీటర్ల నుండి 300 మీటర్లకు ఎత్తిపోసి, నల్లమలలో తవ్వే టన్నెళ్ల ద్వారా బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలించాలి. బనకచర్ల మొత్తం ప్రాజెక్టు ఖర్చులో ఈ మూడో దశ పనులకే దాదాపు సగం ఖర్చు అవుతుంది. మొదటి, రెండు దశలతో పోలిస్తే మూడో దశ పని క్లిష్టమైంది. బనకచర్ల ప్రాజెక్టును సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అంటున్నారు. అంటే నీటిపారుదల శాఖ సిబ్బంది వేతనాలు, ప్రాజెక్టు నిర్వహణకు అయ్యే ఖర్చును రైతులే భరించాలేమో! ప్రస్తుత ఖర్చుల ప్రకారం ఎకరాకు యాభై వేల రూపాయలను రైతులు చెల్లించాలి. ఇది ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పెరగడమే తప్ప తగ్గే సమస్యే లేదు. దాదాపు ఉచితంగా సాగునీరు ఇస్తేనే పండిన పంట గిట్టుబాటు కాక ప్రాజెక్టులో నీరు వున్నప్పటికీ ధాన్యం పడించడానికి రైతులు సిద్ధపడని స్థితిలో ఇంత ఖర్చును భరించడం వ్యవసాయదారులకు సాధ్యమా? ఈ మాత్రం ఆలోచన పాలకులకు తెలియక కాదు. డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు వ్యవసాయాన్ని అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించే విధానాన్ని గతంలో జగన్ మోహన్ రెడ్డి, ప్రస్తుతం చంద్రబాబు నాయుడు ద్వారా అమలు చేయించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అటు విద్యుత్ చార్జీలు, ఇటు సాగునీటి ఖర్చులను పేద రైతులే కాదు, మధ్యతరగతి రైతులు కూడా భరించడం సాధ్యం కాదు. ఇప్పటికే రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి పేరుతో 11 లక్షల ఎకరాల భూమి కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి పోతుంది. రానున్న రోజుల్లో బనకచర్ల లాంటి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుల ద్వారా మరికొన్ని లక్షల ఎకరాల భూమి ఈ కంపెనీల చేతుల్లోకి వెళ్తుంది. అందువల్ల ముందుగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలి. జలయజ్ఞం పేరుతో చేపట్టిన ధనయజ్ఞానికి చెల్లుచీటి పలకాలి.

# ఎవరి చాయిస్ ?

హైదరాబాద్,తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రాంచంద్రరావు పేరును హైకమాండ్ ఖరారు చేసింది. తీవ్ర పోటీ నెలకొన్న సమయంలో ఒకరికి ఇస్తే మరొకరు అసంతృప్తి చెందకుండా వీలైనంత వరకూ ఏకాభిప్రాయంతో ఎవరూ అభ్యంతరం చెప్పని పేరును ఖరారు చేసింది. ఈ విషయంలో అనుకున్న ఫలితం సాధిస్తారు కానీ.. పార్టీ బలోపేతం సంగతేమిటన్నది పెద్ద ప్రశ్నగా మారింది. పార్టీని రామచంద్రరావు అధికార పీఠం వైపు తీసుకెళ్లగలరని ఎక్కువ మంది నమ్మడం లేదు.

రాంచంద్రరావు నిఖార్సైన బీజేపీ నేత కానీ

తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడు రామచంద్రరావు నిఖార్సైన బీజేపీ నేత. బీజేపీలో వర్గ పోరాటం గురించి ప్రచారం జరుగుతూ ఉంటుంది. కానీ ఆయన పేరు మాత్రం పెద్దగా ప్రచారంలోకి రాదు. ఆయన పని ఆయన చేసుకుంటారు. గతంలో ఎమ్మెల్సీగా కూడా గెలిచారు. బీజేపీ భావజాలం, ఆరెస్సెస్ మూలాలతో ఆయన సిన్సియారిటీని అందరూ గౌరవిస్తారు. కానీ తెలంగాణ రాజకీయాల్లో భాగంగా ఉండాల్సినంత దూకుడును ఆయన చూపించలేరన్న అభిప్రాయం మాత్రం ఆ పార్టీ క్యాడర్‌లోనే ఉంది.

రామచంద్రరావు ఎంపిక వెనుక వ్యూహం ఏమిటి?

రామచంద్రరావు.. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ బీజేపీకి పొటెన్షియల్ కాదని ఎక్కువ మంది నమ్ముతున్నారు. మరి ఈ విషయం హైకమాండ్ కు తెలియదా అంటే.. ఖచ్చితంగా తెలుస్తుంది. వారు కూడా ప్రత్యేకమైన వ్యూహంతోనే ఆయన పేరును ఖరారు చేసి ఉంటారని అంచనా చేస్తున్నారు. ఎన్నికల సమయంలో బీజేపీ , బీఆర్ఎస్ మధ్యనే పోటీ జరుగుతోందన్న భావన ఉన్న సమయంలో బండి సంజయ్ ను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించారు. ఫలితంగా సీన్ మారిపోయింది. ఆ సమయంలో ఓట్ల చీలిక ద్వారా బీఆర్ఎస్ మళ్లీ గెలిచే ప్రమాదం ఉందన్న కారణంగా బీజేపీ వెనక్కి తగ్గిందని.. బీఆర్ఎస్‌ను ఓడించడం ద్వారా ఆ పార్టీని నిర్వీర్యం చేసి.. గ్రౌండ్ ను స్వాధీనం చేసుకోవాలని అనుకుందని అందుకే..కాంగ్రెస్ గెలుపునకు పరోక్షంగా సహకరించిందని అనుకున్నారు. దానికి తగ్గట్లుగనే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ ను కైవసం చేసుకుంది. ఆ మూమెంట్ ను కొనసాగించడానికి .. బండి సంజయ్ లేదా.. అర్వింద్..ఈటల రాజేందర్ వంటి వారిని నియమిస్తారని అనుకున్నారు. ఇక్కడ బీజేపీ హైకమాండ్ తమ లెక్కలే వేరని తేల్చింది.

బీఆర్ఎస్ విలీనం లేదా పొత్తుల కోసమే !

బీఆర్ఎస్ నీడ పడినా సహించని బీజేపీ నేతలు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్. వారిని అధ్యక్షులుగా నియమిస్తే.. బీఆర్ఎస్ పై దాడి. చేస్తారు. అది బీజేపీ పెద్దల వ్యూహానికి విరుద్ధం కావొచ్చు.

# బనకచర్ల...మరో కాళేశ్వరం..!



హైదరాబాద్,బనకచర్లపై ఇరు రాష్ట్రాలతో సమావేశం ఏర్పాటు చేస్తానని కేంద్రమంత్రి పాటిల్ ప్రకటించిన నేపథ్యంలో ముందుగా ఇరు రాష్ట్రాలు కూర్చుని ఈ సమస్యపై చర్చించాలి. అలాగే కేంద్రం కూడా వివరాలు తెప్పించుకుని సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. కెసిఆర్ కాళేశ్వరం చేపడతామని అన్నప్పుడు కేంద్రం ప్రేక్షక పాత్ర వహించింది. ఇవాళ లక్షకోట్లకు పైగా దుబారా అయ్యాయి. కాళేశ్వరం ఎటిఎంగా మారిందన్న మోడీ, అమిత్ షాలు ఏనాడూ నిలదీసి అడగలేదు. నిజాయితీగా ప్రశ్నించలేదు. విచారణకు ఆదేశించలేదు. ఇప్పుడు బనకచర్ల విషయంలో అలాంటి పొరపాట్లుజరక్కూడదు. ఎందుకంటే సాధ్యాసాధ్యాలపై కేంద్రం అధ్యయనం చేయించాలి. ఆర్థిక వనరులపై చర్చించాలి. బనకచర్ల ప్రాజెక్టు ఎత్తిపోతల ప్రాజెక్టు. కింది నుండి పైకి నీటిని ఎత్తిపోయడానికి 4,125 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ఇందుకు ప్రతి సంవత్సరం భారీగా ఖర్చు చేయాలి. నిపుణుల అంచనా ప్రకారం కొత్తగా సాగులోకి వచ్చే మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రతి సంవత్సరం ఒక ఎకరానికి రూ.50 వేలు ఖర్చు అవుతుంది. ఇంత ఖర్చును ఎవరు భరించాలన్నది చెప్పాలి. ఎందుకంటే కాళేశ్వరంలో ఇదే జరిగింది. కాళేశ్వరం కొనసాగించాలంటే విద్యుత్ వినియోగం తడిసి మోపెడు అవుతుంది. ఇది కళ్లముందు కనిపిస్తున్న సత్యం. దీనిని కాదని బనకచర్ల అంటూ చంద్రబాబు పలవరించడం, కేంద్రం తలూపడం సరికాదు. ఇకపోతే బిఆర్ఎస్ గత తప్పిదాలను పక్కన పెట్టి బనకచర్లపై ఏదో కొంపలు అంటుకున్నట్లుగా గగ్గోలు పెడుతోంది. ప్రాజెక్టులన్నీ దెబ్బతిన్నా యని, వాటికి ప్రమాదం పొంచివుందని అంటోంది. పదేళ్లపాటు లేని ప్రమాదం ఏడాదిన్నరలో ఎలా వచ్చిందో హరీష్ రావు, కెటిఆర్‌లు చెప్పాలి. గగ్గోలు పెడితే అబద్దాలు నిజాలై పోవు. కాళేశ్వంరపై ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడలో భాగంగా బిఆర్ఎస్ హంగామా చేస్తోంది. ఎందుకంటే ఓ పద్దతి ప్రకారం ప్రాజెక్టులు, బనకచర్ల, స్కూళ్లు, హాస్టళ్లు తదితర సమస్యలపై ప్రస్తావిస్తూ తెలంగాణ ఆగమై పోయిందన్న రీతిలో మాట్లాడుతు న్నారు. బిఆర్ఎస్ నేతలు చేసే ఆరోపణలు నిజమైతే అందుకు వారే బాధ్యత వహించాలి.ఎందుకంటే పదేళ్ల పాటు తెలంగాణను ఏలింది వారే కనుక వారే సమాధానం చెప్పాలి. ఇకపోతే బనకచర్లపై ఎపిలో మాట్లాడి సాధ్యాసాధ్యాలు చర్చించాలి. ఎపి సిఎం చంద్రబాబు కూడా పోలవరం పూర్తి కాకుండానే ఇప్పుడు బనకచర్ల గురించి మాట్లాడుతున్నారు. అసలు లోటు బడ్జెట్‌లో ఉన్న సమయంలో దీనికి డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పడం లేదు. ఇది సాధ్యమా అన్నది చర్చించడం లేదు. విభజిత ఆంధప్రదేశ్ తర్వాత పోలవరం ఆంధ్రకు వరం అంటూ హం గామా చేసిన నేతలే నేడు బనకచర్ల గురించి హడావుడి చేయడం వెనుక అనుమానాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు కూడా కారట్రాక్టర్ల, రాజకీయ నాయకుల ఆదాయం సమకూర్చేదిగా మారకూడదన్నదే సకలజనుల అభిప్రాయం. గోదావరి వరద నీటిని రాయలసీమలోని పెన్నా బేసిన్‌కు మళ్లించి తద్వారా రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు ఇవ్వడం లక్ష్యంగా టిడిపి కూటమి ప్రభుత్వం చెబుతుంది. గోదావరి నుండి ప్రతి సంవత్సరం సుమారుగా రెండువేల టిఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతుంది. ఈ నీటిలో పదో వంతు కనీసం 200 టిఎంసిల నీటిని వెనుకబడిన జిల్లాలకు మళ్లిస్తే రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెరుగుతుందంటూ నేతలు చెబుతున్నారు. ఇందుకో సం రూ.80,112 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేసి, జలహారతి కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ అంగీకరించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం సహాయం చేయాలని ప్రధానమంత్రిని, కేంద్ర ఆర్థికమంత్రిని రాష్ట్ర ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు ఢిల్లీ వెళ్లి కేంద్ర ఆర్థిక శాఖ, జలశక్తి శాఖ అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వడానికి 48 వేల ఎకరాల భూమిని సేకరించడం, సుమారు 27 కిలో మీటర్ల సొరంగం తవ్వడం, రూ.80 వేల కోట్లు పైగా ఖర్చు పెట్టడం సాధ్యమయ్యే పనేనా అన్న అనుమానాలు వస్తున్నాయి. కాళేశ్వరం తరహాలో కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకే అన్న అనుమానాలు వస్తున్నాయి. అందుకే కేంద్ర అధికారులు ఆదిలోనే అడ్డువేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ తోపాటు ఇతర హామీలు అమలు చేయడానికి ఖజానా ఖాళీ అని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం రూ.80 వేల కోట్ల భారీ ఖర్చుతో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తాననడం అనుమానాలకు తావిస్తోంది. ఇది సాధ్యమేనా అని అనేకమంది ఇప్పటికే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అఖిలపక్ష సమావేశం వేసి, నీటిపారుదలరంగ నిపుణుల అభిప్రాయాలను, సూచనలను తీసుకోవడం ప్రభుత్వ కనీస బాధ్యత. ఆ తరవాతే దీనిపై ముందుకు సాగాలి. దీనికన్నా ముందు పోలవరం సజావుగా పూర్తి కావాలి. పోలవరం బాధితులు ఇప్పటికే రోడ్డున పడ్డారు. వారిని ఆదుకునే ప్రయత్నాలు ముందుకు సాగడం లేదు. భూములు, ఇళ్లు కోల్పోయిన గిగిరిజను లు గౌరవంగా బతికేలా చేయాలి. అమరావతికి భూమలు ఇచ్చిన రైతులు కూడా దర్జాగా బతకగలగాలి. ఇవన్నీ చేయకుండా, నిపుణలుతో చర్చించకుండా ముందుకు సాగాలనుకోవడం చంద్రబాబుకు తగనిపని. ఈ ప్రాజెక్టు గేమ్ చేంజర్, సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు, హైబ్రిడ్ యాన్యూటీ (హమ్) స్కీమ్ అని చెబుతున్నారు. ప్రాజెక్టులు కట్టి, నీటిపారుదల అభివృద్ధి చేస్తే ఎవరికి అభ్యంతరం వుండదు. కానీ గత ఐదేళ్ల చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అలా జరగలేదు. ఉమ్మడి ఎపిలో కూడా చంద్రబాబు అనేక ప్రాజెక్టులు చేపట్టినా పూర్తిచేయలేక పోయారు. గత కొన్ని దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన అనేక సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాలేదు. అవేవీ వ్యవసాయాభివృద్ధికి తోడ్పడలేదు. కానీ కాంట్రాక్టర్లకు, అధికార పార్టీల నాయకులకు ప్రధాన ఆదాయ వనరులుగా మారాయి. అందుకు పోలవరమే సాక్ష్యం. విభజన తరవాత ఐదేళ్లు పాలించిన చంద్రబాబు అమరావతిని, పోలవరాన్ని పూర్తి చేయలేక పోయారు. తరవాత అధికారంలోకి వచ్చిన జగన్ కూడా ఈ రెంటినీ పక్కన పెట్టి ఎపిని అప్పులకుప్పగా తయారు చేశారు.

# పాశమైలారానికి ఎవరు బాధ్యులు ?

హైదరాబాద్,కంపెనీ సైరన్ మోగే సమయానికి అంతా ఉత్సాహంగా తాము రోజూ పనిచేస్తున్న ఫ్యాక్టరీలో చేరారు. పొద్దున్నే సద్దికట్టుకుని వచ్చిన వారు కొందరు...ఇక్కడే టిఫిన్ చేద్దామనుకున్న వారు మరికొందరు.. రోజూలాగు డ్యూటీలో చేరారు. ఇదే తమకు ఆఖరి రోజని..తమ వారిని ఇక చూడలేమని వారు అనుకోలేదు. అలాగే కుటుంబీకులు కూడా రోజులాగానే వీడ్కోలు పలికినా...సాయంత్రానికి మళ్లీ వస్తారన్న నమ్మకంతో ఉన్నారు. కనీసం కడసారి చూపుకైనా నోచుకోలేని దుస్థితిలో ఇప్పుడు ఉన్నారు. 45 కుటుంబాలు ఛిద్రమయ్యాయి. దీనికి ఎవరు బాధ్యులు. రక్షణ చర్యలు తీసుకోకుండా యథాలాపంగా నడిపిన కంపెనీదా... లేకపోతే, నిర్లక్ష్యం వహించిన అధికారులదా అన్నది తేలాలి. ఏ ప్రమాదం జరిగినా కంటితుడుపు చర్యలు తప్ప కఠిన చర్యలకు ఉపక్రమించడం లేదు. పాశమైలారం కావచ్చు, ఇండస్ట్రియల్ పార్కుల్లోనే భద్రత డొల్ల అని తేలింది. సరైన భద్రతా ప్రమాణాలు లేకుండానే ఇలాంటి వందల కంపెనీలు నడుస్తున్నాయి. పేరుకే కార్మికశాఖ ఉంది. కార్మికుల గురించి వారు పెద్ద స్పందించరు. హైదరాబాద్ క్రాస్ రోడ్డులో ఉన్న అంజయ్య భవన్‌కు వెళితే ఎన్నో దీనగాథలు కనిపిస్తాయి. కార్మికశాఖ మంత్రి కావచ్చు...అసలు మంత్రులకే తమ విధులేమిటో తెలియదు. కేవలం మంత్రి పదవులే లక్ష్యంగా పెట్టుకుని రాజ్యమేలుతున్నారు. కార్మిక శాఖను చూస్తున్న మంత్రికి ఎన్ని కర్మాగారాలు ఉన్నాయి..వాటిని సక్రంగా మెయింటెయిన్ చేస్తున్నారా లేదా తెలుసుకునే అవకాశం రాలేదు. ఎందుకంటే ఆయన పదవి చేపట్టి నెలకూడా దాటి ఉండకపోవచ్చు. అలాగని గతంలో పనిచేసిన కార్మిక మంత్రులు ఎవ్వరూ కూడా ఈ ఛాలయకు రాలేదు. పదవి ఇచ్చిన రాహుల్‌కు కృతజ్ఞతలు చెప్పుకోవడం, ఇతర రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడంతోనే ఆయనకు సరిపోయింది. నిజానికి ఏ మంత్రికీ తమ శాఖలో ఏముందో, ఏం జరుగుతందో తెలియదు. రాజకీయాలు తప్ప మరోటి వారికి తెలియదు. బిజెపి అధ్యక్షుడు ఎవరు..బిసియా, బ్రాహ్మణుడా అన్న చర్చ చేయడంలోనే మంత్రుల కాలం గడిచింది. చనిపోయినవారిలో ఇప్పుడు ఎందరు బిసిలు, ఎస్సీలు పోయారు, ఎంతమంది అగ్రకులాల వారు తప్పించుకున్నారో ఈ మంత్రులను అడిగి తెలుసుకోవాలి. ప్రాణానికి కులమతం లేదని తెలుసు కోవాలి. అందుకే ప్రమాదానికి గల కారణాలు వెతకాలి. కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి మరో దుర్ఘటన జరక్కుండా మంత్రి వివేక్ కార్మిక శాఖను అప్రమత్తం చేయాలి. సిగాచి లాంటి సంస్థలను జల్లెడ పట్టాలి. నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలు నడుస్తున్నాయా లేదా అన్నది పరిశీలించాతి. ఎందుకంటే సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఘటనలో మృతుల సంఖ్య 45కు చేరింది. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భవనం, శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వెలికితీసిన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రుల్లో 11 మంది పరిస్థితి పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఇలా ఎందుకు జరిగిందన్నది ప్రాథమిక విచారణ జరగాలి. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారంటే తీవ్రత ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వారాయి. సమాచారం అందుకున్న కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో అక్కడి పరిస్థితి భీతావహంగా మారింది. ఇక ఇక్కడ కార్మికులే కాదు..అందులో పనిచేస్తున్న



ఇతర ఉద్యోగులు కూడా ఉన్నారు. సిగాచి రసాయన పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ దుర్మరణం పాలయ్యారు. గోవన్ ప్లాంట్‌లోకి అడుగుపెట్టిన సమయంలోనే పేలుడు సంభవించింది. ప్రమాదంలో కడపజిల్లాకు చెందిన ఓ ప్రేమజంట పెళ్లి చేసుకున్న మధురజ్ఞాపకం మరువకుండానే అనంతలోకాలు పోయారు. మొన్నటికి మొన్న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమాన ప్రమాద ఘటనకు సంబంధించిన విషాదం మరువక ముందే ఈ ఘటన జరగడం విచారకరం. పరిశ్రమల్లో భద్రతపై త్వరలోనే ఓ కమిటీ వేస్తామని కార్మిక మంత్రి వివేక్ తెలిపారు. అధిక పనిగంటలపై కార్మికులు ఫిర్యాదు చేస్తే లేబర్ కమిషన్ దర్యాప్తు చేస్తుందన్నారు. ఫిర్యాదు చేయడం కాదు...అలా జరుగుతుందా లేదా అన్న విషయం ఆరా తీయాల్సింది కార్మికశాఖనే. ఈ పరిశ్రమలో మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ అనే పౌడర్ తయారు చేస్తున్నారు. గత 40 ఏళ్లుగా ఈ సంస్థ పని చేస్తోందని తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పలు రసాయన పరిశ్రమల భద్రతపై అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎక్కడైన ప్రమాదం జరిగినప్పుడే యాజమాన్యాలు పలు జాగ్రత్తలు తీసుకుంటాయి. తర్వాత భద్రతా పరమైన అంశాల జోలికి వెళ్లడం లేదు. ముఖ్యంగా రసాయన పరిశ్రమలను చాలా జాగ్రత్తగా నిర్వహించాల్సి ఉంటుంది. రసాయనాల మధ్య ఒత్తిడి పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అందుకే కంపెనీకి సంబంధించిన ఇంజినీర్లతో యంత్రాలను తనిఖీ చేయించాలి. జిల్లా అధికారులూ పరిశ్రమలను నిరంతరంగా తనిఖీ చేయాలి. కాలుష్య నియంత్రణ మండలి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి, అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీలకు వెళ్తుంటారు. వీరు తనిఖీలు చేసి ఏడాది నుంచి రెండేళ్ల కాలపరిమితికి అనుమతులు ఇస్తుంటారు. క్షుణ్నంగా పరిశీలన చేయకపోవడంతో ఇలాంటి ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం పరిశ్రమల నిర్వహణ ఉండాలి. ఇవి కాగితాల్లోనే కనిపిస్తాయి. ప్రతి పరిశ్రమలలో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ వాహనాలు, సిబ్బంది ఉండాలి. అంతేకాదు అగ్నిమాపక సిబ్బందిని వారే నియమించుకోవాలి. ఈ కార్మికులు మూడు షిఫ్టుల్లో పనిచేయాలి. కానీ ఒక్కరిని కూడా నియమించుకోలేదు. నైపుణ్యం కలిగిన కార్మికులను తీసుకోవట్లేదు. తక్కువ వేతనాలు ఇస్తూ ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలనే పనిలోకి తీసుకుంటున్నారు. చిన్నచిన్న ప్రమాదాల బారినపడి కార్మికులు మృతిచెందిన విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇవన్నీ ఇకనుంచి బంద్ కావాలి. క్షేత్రస్తాయిలో ఒక్కో పరిశ్రమను అడుగడుగునా తనిఖ్ఖ చేయాలి. నిపుణుల బృందంద పరిశీలించాలి. అప్పుడే ప్రమాదాలను కొంతయినా నివారించగలుగుతామని గుర్తించాలి.

# ఎపి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన జగన్

భీమవరం,వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నిమ్మల రామానాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ ఏపీ ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసి అప్పుల పాల్జేశారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నష్టం కన్నా.. జగన్ ఐదేళ్ల పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో విస్తృతమైన సంక్షేమ అజెండాను ప్రకటించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మరో రెండు పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. ఈ మేరకు మంత్రి నిమ్మల రామానాయుడు ఈ రెండు పథకాల గురించి కీలక ప్రకటన చేశారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పథకాన్ని ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అమల్లోకి తీసుకువస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. అలాగే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలో మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించారు. పాలకొల్లు నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై వివరిస్తున్నామని చెప్పుకొచ్చారు. తమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చూసిన ప్రజలు తమది మంచి ప్రభుత్వమని చెబుతున్నారని పేర్కొన్నారు. పేదరికాన్ని పారద్రోలేలా మార్గదర్శకుల సహకారంతో పీ4ను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అన్నింటినీ అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు మంత్రి నిమ్మల రామానాయుడు. కూటమి పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు ఏపీ ఆర్థిక పరిస్థితిని చక్కబెడుతూనే ప్రతి ఇంటికి సంక్షేమాన్ని, ప్రగతిని అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని ఉద్ఘాటించారు.

# బీహార్‌లో బూత్‌స్థాయి ఏజెంట్ల పెంపు

న్యూఢిల్లీ,బీహార్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కోసం బూత్ స్థాయి ఏజెంట్ల (బిఎల్ఎ)ను పెంచాలని ఎన్నికల కమిషన్ బుధవారం ఆదేశించింది. తర్వాత ఆందోళనలు లేవనెత్తకుండా ముందుగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రణాళిక ప్రకారం సజావుగా కొనసాగుతోందని, జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను పాటిస్తోందని ఇసి పేర్కొంది. ఎస్ఐఆర్ పక్రియ గురించి రాజకీయ పార్టీలతో బుధవారం జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఇసి వర్గాలు తెలిపాయి. భారీ కసరత్తులో సుమారు లక్షమంది శిక్షణ పొందిన బూత్ లెవల్ అధికారులు, 243 మంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, 38 జిల్లా, ఎన్నికల అధికారులు, 9 డివిజన్‌ల కమిషనర్లు,బీహార్ ప్రధాన ఎన్నికల అధికారి సమన్వయంతో లక్షమంది వాలంటీర్లు పాల్గంటారు. ఇసిఐ ద్వారా నమోదు చేసిన గుర్తింపుపొందిన జాతీయ, రాష్ట్రీయ రాజకీయ పార్టీలు ఇప్పటికే పోలింగ్ స్టేషన్లలో 1.5లక్షలకు పైగా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకున్నప్పటికీ, పార్టీలు అదనపు బిఎల్ఎలను నియమించడానికి సమయం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. తర్వాత ఫిర్యాదు చేయడం కన్నా ముందుగానే ఎక్కువ మంది బిఎల్ఎలను నియమించాలని ఇసి వర్గాలు తెలిపాయి. ఇదిలావుంటే ప్రజలు తాము ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడే ఓటర్లుగా నమోదు చేసుకోవాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. తమకు సొంత ఇల్లు వేరే చోట ఉందని అక్కడ ఓటరుగా నమోదు చేసుకోకూడదన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితాలను ప్రత్యేకంగా ముమ్మర తనిఖీ చేస్తున్ననేపథ్యంలో ఆయన ఈమేరకు తెలిపారు. నివాసం ఉంటున్న చోటే ఓటు ఉండాలన్న నిబంధన పాటించాలని అన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ప్రజలు తాము ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో నివాసం ఉంటున్నారో అక్కడ మాత్రమే ఓటుహక్కు పొందాలని తనను కలిసిన బూత్ స్థాయి అధికారులకు సీఈసీ వివరించారు. ఢిల్లీలో నివాసం ఉంటూ పట్నాలో ఇల్లు ఉందని అక్కడ ఓటుహక్కు పొందలేరని పేర్కొన్నారు. ప్రజలు తాము వలస వెళ్లిన చోట ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, కాని పాత నియోజకవర్గంలో ఓటరు కార్డును ఉంచుకోవడం శిక్షార్హమైన నేరమని ఈసీ అధికారులు తెలిపారు.

# వ్యూహామేంటి?

హైదరాబాద్,బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా ఈటలకు అవకాశం ఇవ్వకపోవడం ఆయనను అవమానించడమేనన్న భావన ఈటల అనుచరులలో వ్యక్తం అవుతున్నది. వాస్తవానికి బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన ఈటల కాషాయ కండువా కప్పుకున్న సమయంలోనే పలువురు విస్మయం వ్యక్తం చేశారు. వామపక్ష భావజానం ఉన్న ఈటల బీజేపీలో ఇమడటం కష్టమన్న అభిప్రాయాన్ని అప్పట్లోనే పరిశీలకులు వ్యక్తం చేశారు. వారి విశ్లేషణలకు తగినట్లుగానే ఈటల బీజేపీలో ఇమడ లేకపోతున్నారనీ, ఉక్కపోతకు గురౌతున్నారనీ పలు సందర్భాలలో గట్టిగా వినిపించింది. నిజానికి వామపక్ష భావజాలం ఉన్న ఈటల చేరితే కాంగ్రెస్ లో చేరాలి కానీ.. తన భావజాలానికి పూర్తి వ్యతిరేకమైన బీజేపీ కండువా ఎలా? ఎందుకు కప్పుకున్నారన్న ప్రశ్రలు ఉత్పన్నమయ్యాయి. అయితే ఈటల మాత్రం పరిశీలకుల విశ్లేషణలను డౌటానుమానాలను పూర్వపక్షం చేస్తూ ఉక్కపోతకు గురైనా, ఇబ్బందులు పడినా బీజేపీలోనే కొనసాగారు. సాగుతున్నారు. ఈ మధ్యలో బీజేపీ అధిష్టానం కూడా ఈటల పాపులారిటీనీ, సిన్సియారిటీనీ గుర్తిస్తూ పార్టీలో సముచిత ప్రాధ్యాన్యత ఇస్తూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల బరిలో పరాజయం పాలైనా.. లోక్ సభ ఎన్నికలలో ఈటలకు మల్కాజ్ గిరి స్థానం నుంచి పోటీకి అవకాశం ఇచ్చింది. ఆ ఎన్నికలలో విజయం సాధించిన ఈటల ఎంపీ అయ్యారు.అలాగే బండి సంజయ్ ఈటల మధ్య పొడసూపిన విభేదాల సందర్భంలో బీజేపీ హైకమాండ్ బండి సంజయ్ ను రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించి ఈటలకు మద్దతుగా నిలిచింది. సరే బండి సంజయ్ స్థానంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పగ్గాలు అప్పగించారు. పార్టీలో గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణలో చేరికల కమిటీని ఏర్పాటు చేసిన బీజేపీ ఆ కమిటీకి చైర్మన్ గా ఈటలను నియమించింది. ఈటల ఆధ్వర్యంలో బీజేపీలోకి పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయనీ... ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి పెద్ద ఎత్తున వలసలు ఉంటాయనీ అంతా ఆశించారు. అదలా ఉంటే బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ గా ఈటల నియామకానికి ముందు పార్టీలో ఈటలకు చాలా చాలా అవమానాలు ఎదుర య్యాయని చెబుతారు. కానీ ఈటల బీజేపీలో చేరిన క్షణం నుంచి రాష్ట్రంలో ఆ పార్టీ నిర్వహించిన అన్ని కార్యక్రమాలలోనూ భాగస్వామిని చేయడం, అమిత్ షా, మోడీ వంటి అగ్రనేతల సభలలో కూడా వేదికపై ఆసనం ఇవ్వడంతో ఈటలకు బీజేపీలో ఉక్కపోత అన్న భావన అప్పట్లో పలువురిలో వ్యక్తమైంది. అయితే బండితో విభేదాలు ఉన్నప్పటికీ ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నంత కాలం పార్టీలో ఈటల గౌరవానికి ఎటువంటి భంగం వాటిల్లలేదు.

# ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం


హైదరాబాద్, అధికారంలో ఉన్నా లేకపోయినా, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. పేదల ఆకలి తీర్చడం, బడుగు బలహీన వర్గాల అవసరాలను తీర్చడమే కాంగ్రెస్ అసలైన లక్ష్యమని అన్నారు. ప్రతి బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించామని చెప్పారు.ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ అభిమతాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 90 వినతులు వచ్చినట్లు తెలిపారు. వీటిలో అధికంగా ధరణి బాధితుల సమస్యలే ఉన్నాయని చెప్పారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వమంతా కృషి చేస్తోందని తెలిపారు. ఓ పేదవాడు నేరుగా మంత్రిని కలిసి సమస్య వినిపించడం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందన్న సంగతి ప్రజలు గుర్తుపెట్టుకోవాలన్నారు. అలాగే, బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో హరీష్ రావు తడబడినట్లు స్పష్టంగా అర్థమవుతోందని శ్రీహరి పేర్కొన్నారు. 100 టీఎంసీల నీరు వృథాగా పోతుందన్న వార్తలు మీడియాలో వచ్చినట్లు తెలిపారు. ఈ అంశంపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని అన్నారు. వచ్చే వారం కృష్ణ నదీ జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర బీజేపీ నేతలపై కూడా మంత్రి శ్రీహరి



తీవ్ర విమర్శలు చేశారు. బీసీల పట్ల బీజేపీ అనుసరిస్తున్న వైఖరి మరోసారి బయటపడిందన్నారు. గతంలో బండి సంజయ్‌ను తొలగించి కిషన్ రెడ్డికి రాష్ట్ర అధ్యక్ష పదవిని అప్పగించిన తీరు ఈ విషయాన్ని స్పష్టంగా చూపుతుందని విమర్శించారు. కుల గణన సర్వే అనంతరం కూడా బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కవితకు కీలక పదవి ఇవ్వాలన్న సూచన చేస్తూ, రైల్ రోకో కార్యక్రమం చేపట్టేముందు పార్టీలో బీసీలకు ప్రాధాన్యత కలిగిన పదవి ఏర్పాటు చేయాలని అన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు.. సగమే!

అమరావతి,సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో సీఎం చంద్రబాబు ఏపీలో నుంచి ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా.. ప్రజలను కలుసుకుని ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన మంచిని వారికి వివరించాలన్నది టార్గెట్. అంతేకాదు.. సంక్షేమం, పథకాలు, సూపర్ 6తో పాటు.. ఏడాది లో తీసుకువ చ్చిన పెట్టుబడులు.. త్వరలోనే రానున్న ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను కూడా ప్రజలకు వివరించాలన్నది చంద్రబాబు ఉద్దేశం.ఈ నేపథ్యంలోనే రెండు రోజుల కిందట పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసిఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలకు కూడా చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. చేసింది చెప్పుకోలేక పోతే.. వచ్చే ఎన్నికల నాటికి ప్రజలు ఎటైనా తిరిగే అవకాశం ఉంటుందని కూడా హెచ్చరించారు. కాబట్టి.. ప్రజలకు ఏడాది కాలంలో చేసిన మంచిని వివరించే ప్రయత్నం చేయాలని బాబు సూచించారు. దీనికి గాను సుపరిపాలన లో తొలి అడుగు పేరిట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.కట్ చేస్తే.. బుధవారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఎంత మేరకు సక్సెస్ అయిందనేది చూస్తే.. రాష్ట్రంలో సగం నియోజకవర్గాల్లో కూడా. ఈ కార్యక్రమం ప్రారంభం కాలేదు. మొత్తంగా 135 నియోజకవ ర్గాల్లో టీడీపీ విజయం దక్కించుకుంది. వీటిలో ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రధానంగా పర్యటించి.. ప్రజలకు వివరించాలి. కానీ, తొలి రోజు సగం నియోజకవర్గాల్లో కూడా కార్యక్రమం



ప్రారంభం కాలేదన్నది పార్టీ వర్గాలే చెబుతున్నాయి.అయితే.. కొందరు దీనికి కారణాలు చెబుతున్నారు. పింఛన్ల పంపిణీ ఇంకా పూర్తికాలేదని.. అందుకే ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు ప్రారంభించలేదని చెప్పుకొచ్చారు. మిగిలిన చోట్ల మాత్రం కొంత మేరకు ప్రారంభమైంది. అయితే.ప్రజల నుంచి ఏమేరకు స్పందన వస్తుందన్నది చూడాలి. ప్రస్తుతం సగానికి పైగా నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కాకపోవడంపట్ల పార్టీ చీఫ్ పల్లా విస్మయం వ్యక్తం చేశారు.

# ట్రంప్‌ను మస్క్ ఓడించగలడా?



అమెరిక,అమెరికన్ రాజకీయాల్లో ప్రస్తుతం ట్రంప్ వర్సెస్ మస్క్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. ఎన్నికల ముందర ఈ ఇద్దరు మిత్రులు అధికారంలోకి వచ్చాక విభేదాలతో అగ్గి రాజేస్తున్నారు. వీరిద్దరి మధ్య సంబంధం, ఒకరిపై మరొకరి ప్రభావం, భవిష్యత్తులో రాజకీయాలపై వీరి పాత్ర ఎలా ఉండబోతోంది అనేది ఆసక్తికరంగా మారింది. ట్రంప్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లుకు వ్యతిరేకంగా ప్రభుత్వం నుంచి వైదొలిగిన మస్క్.. ఆ బిల్లు ఆమోదం పొందితే ట్రంప్ కు వ్యతిరేకంగా అమెరికాలో కొత్త పార్టీ పెడుతానంటూ సంచలన ప్రకటన చేశార. దీంతో ఎలాన్ మస్క్ ప్రస్తుతం బలంగా ఉన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను అధ్యక్ష ఎన్నికల్లో ఓడించగలడా అనే అంశం హాట్ టాపిక్ గా మారింది.

–చట్టపరమైన అడ్డంకులు.. మస్క్ అధ్యక్ష పదవికి అనర్హుడు

మస్క్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తాడా, చేస్తే గెలుస్తాడా అనే చర్చకు ముందు, అత్యంత కీలకమైన ఒక చట్టపరమైన వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఎలాన్ మస్క్ అమెరికా అధ్యక్ష పదవికి చట్టపరంగా అర్హుడు కాదు. అమెరికా రాజ్యాంగం ప్రకారం.. అధ్యక్ష పదవికి పోటీ చేసే వ్యక్తి "సహజ పౌరుడు" అయి ఉండాలి. అంటే అమెరికా భూభాగంలో జన్మించిన వ్యక్తి అయి ఉండాలి. మస్క్ దక్షిణాఫ్రికాలో జన్మించారు. ఈ నిబంధనను మార్చాలంటే రాజ్యాంగ సవరణ అవసరం.. అది అమలులోకి రావడం దాదాపు అసాధ్యం అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాబట్టి మస్క్ నేరుగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి ట్రంప్‌ను ఓడించే అవకాశం చట్టపరంగా లేదు.

– ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా రాజకీయ ప్రభావం

అధ్యక్ష పదవికి నేరుగా పోటీ చేయలేనప్పటికీ, మస్క్ అమెరికా రాజకీయాల్లో గణనీయమైన ప్రభావాన్ని చూపగలడు. మస్క్ యాజమాన్యంలోని ఎక్స్, రాజకీయ ప్రచారానికి, అభిప్రాయాలను ప్రభావితం చేయడానికి ఒక శక్తివంతమైన వేదిక. ఇది విస్తృతమైన శ్రోతలను కలిగి ఉంది, తద్వారా మస్క్ తన రాజకీయ అభిప్రాయాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లగలడు. మస్క్ తన ఆర్థిక బలాన్ని ఉపయోగించి రాజకీయ ప్రచార నిధులను ఏర్పాటు చేయడం లేదా మద్దతు ఇవ్వడం ద్వారా అభ్యర్థుల విజయావకాశాలను ప్రభావితం చేయగలడు. మస్క్ ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్ష పరిశోధన, కృత్రిమ మేధస్సు వంటి రంగాలపై ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయగలడు. ఈ రంగాలలో ప్రభుత్వ జోక్యం లేదా ప్రోత్సాహం మస్క్ కంపెనీలకు లాభదాయకం కాబట్టి, అతను ఈ అంశాలపై తన ప్రభావాన్ని కొనసాగిస్తాడు. సిద్ధాంతపరంగా, హౌస్ స్పీకర్ వంటి కొన్ని పదవులకు పౌరసత్వం అవసరం లేదు. అయితే, ఇవి కేవలం సిద్ధాంత స్థాయిలోనే ఉంటాయి, వాస్తవ రాజకీయాల్లో అవి ఆచరణ సాధ్యం కావు.

– ట్రంప్ అగ్రస్థానంలో.. మస్క్ పరోక్ష ప్రభావం

ట్రంప్ ప్రస్తుతం అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మస్క్‌తో కోల్డ్ వార్ నడుస్తున్నప్పటికీ, డొనాల్డ్ ట్రంప్‌కు కన్జర్వేటివ్ ఓటర్లలో బలమైన మద్దతు ఉంది. ఆయన రెండోసారి అధ్యక్ష పదవికి న్యాయపరంగా అర్హుడే కాకుండా తన మద్దతుదారుల మధ్య అపారమైన అభిమానాన్ని కలిగి ఉన్నారు. మస్క్ ప్రత్యక్ష రాజకీయ పోటీలో ఉండడు, కానీ పరోక్షంగా తన ప్రభావాన్ని కొనసాగిస్తాడు. పెద్ద ప్రభుత్వ వ్యతిరేకత, ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్ష రంగం వంటి అంశాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, విధాన స్థాయిలో మార్పులను ప్రభావితం చేస్తాడు.కొన్ని సందర్భాల్లో మస్క్, ట్రంప్ మధ్య విభేదాలు భగ్గుమన్నప్పటికీ, పూర్తి స్థాయిలో వ్యతిరేకంగా మారే అవకాశం తక్కువ. ఎందుకంటే, మస్క్ కంపెనీలకు ఫెడరల్ సంబంధాలు అవసరం. అలాగే, ట్రంప్ కూడా మస్క్ యొక్క ఆర్థిక, సాంకేతిక ప్రభావాలను పూర్తిగా విస్మరించలేడు.భవిష్యత్తులో ట్రంప్ ప్రభుత్వం టెస్లా లేదా స్పేస్ఎక్స్‌కు ఫెడరల్ సహాయం తగ్గించినట్లయితే, మస్క్ ఒక నిర్ణయానికి రావచ్చు. అతను డెమొక్రాట్‌లకు దగ్గరవ్వడం లేదా "టెక్ స్వావలంబన"ను నినాదంగా మలచుకోవడం వంటి మార్గాలను ఎంచుకోవచ్చు. అదే సమయంలో ట్రంప్.. జెఫ్ బెజోస్ వంటి మస్క్ ప్రత్యర్థులకు దగ్గరయ్యే అవకాశం ఉంది. ఇది "స్పేస్ రేస్"ను మరింత తీవ్రతరం చేస్తుంది.ఎలాన్ మస్క్ అమెరికా అధ్యక్షుడిగా చట్టపరంగా కాలేడు. అయితే అమెరికన్ విధానాలపై అతని ప్రభావం మాత్రం తగ్గదు. డొనాల్డ్ ట్రంప్ రాజకీయ అగ్రస్థానంలో కొనసాగినప్పటికీ, మస్క్ ఒక శక్తిగా పరోక్షంగా ప్రభావం చూపుతూనే ఉంటాడు. అమెరికా రాజకీయ రంగంలో ఇది ఒక నూతన శకం ప్రారంభమవుతోందనడంలో సందేహం లేదు, ఇక్కడ సాంకేతిక దిగ్గజాలు, వ్యాపారవేత్తలు రాజకీయాలపై తమ ప్రభావాన్ని పరోక్షంగా చూపుతున్నారు.

# పవన్ ప్లస్ మాధవ్..కూటమిలో కొత్త బంధం!



అమరావతి,జనసేన అటు టీడీపీకి ఇటు బీజేపీకి కావాల్సిన పార్టీ. ఆ మాటకు వస్తే ఏపీలో కూటమిని కుదిరిందే జనసేన అని చెప్పాల్సి ఉంటుంది. కూటమి రెండు చక్రాలూ టీడీపీ బీజేపీ అయితే ఇరుసుగా ఇంధనంగా జనసేన ఉంది. అలా కూటమి బండి జోరు చేయడానికి తన సర్వ శక్తులూ పవన్ పెట్టారని కూడా చెబుతారు.ఇదిలా ఉంటే ఏపీలో కూటమిలో మూడు పార్టీలూ ఉన్నా ఎపుడూ చంద్రబాబు పవన్ మాత్రమే కనిపిస్తూ వస్తున్నారు. ఏ విషయం మీద అయినా ఈ ఇద్దరే కూర్చుని చర్చిస్తూ ఉంటారు అన్నది ప్రచారంలో ఉంది. ఇక బీజేపీ నుంచి పురంధేశ్వరి ఉన్నా చాలా సార్లు ఆమె ప్రెజెన్స్ అయితే కనిపించడంలేదని చర్చ కూడా ఉండేది.అయితే ఇపుడు ఏపీ బీజేపీలో కొత్త సారథిగా పీవీఎన్ మాధవ్ వచ్చారు. ఆయన యువకుడు, ఉత్సాహవంతుడు, అన్నింటికీ మించి ఒరిజినల్ బీజేపీ లీడర్. ఆయనకు బీజేపీ పెద్దలతో మంచి సాన్నిహిత్యం ఉంది. అందరి వాడుగా పేరుంది. ఏపీ బీజేపీని అభివృద్ధి చేద్దామన్న తపన కూడా ఉంది.దాంతో మాధవ్ కి నాయకత్వం అప్పగించడానికి ఇవే కారణాలు అని అంటున్నారు. ఇక కూటమిలో అయినా ఏపీలో అయినా రాజకీయాలను మార్చడానికి గేమ్ చేంజర్ ఎవరు అంటే పవన్ కళ్యాణ్ జనసేన అని ఠక్కున చెబుతారు.ఆయన కీ రోల్ అలా ప్లే చేస్తున్నారు. అందుకే బీజేపీ కేంద్ర నాయకత్వం పవన్ కి ఎంతో విలువ ఇస్తుంది. మోడీ ఏపీకి వస్తే చాలు పవన్ తోనే ఎంతో అభిమానంగా ఉంటారు. అయితే మోడీ తరువాత ఏపీలో అలా పవన్ చేయిని పట్టుకుని ఏపీలో బీజేపీతో గట్టిగా కలిపి ముందుకు తీసుకుని వెళ్ళే పరిస్థితి అయితే లేదు.కానీ ఇపుడు ఆ లోటు తీరింది అని అంటున్నారు. మాధవ్ కి పవన్ తో మంచి సాన్నిహిత్యం ఉంది. అలాగే పవన్ కూడా మాధవ్ పట్ల ఎంతో సుముఖంగా ఉంటున్నారు. మాధవ్ ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ కాగానే పవన్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఇక ఆయన నాయకత్వంలో బీజేపీ ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ అయిన మరుసటి రోజే మాధవ్ కూడా పవన్ కి నిజమైన మిత్రుడిగా నిలబడ్డారు. తమిళనాడు ప్రభుత్వం పవన్ మీద క్రిమినల్ కేసులు పెట్టింది. ఆయన మురుగన్ సమావేశంలో పాల్గొన్నారు నిబంధనలు ఉల్లఘించారు అన్న దాని మీద కేసులు పెట్టింది. దాని మీద మాధవ్ గట్టిగా ఖండించారు. డీఎంకే మీద విమర్శలు చేశారు.పవన్ పై కేసుని మురుగన్ మీద దాడిగా భావిస్తామని డీఎంకే సర్కార్ ని హెచ్చరించారు. అంతే కాదు తమిళనాడులో దుర్మార్గపు పాలన సాగుతోంది అని మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు బీజేపీ నేత అన్నామలైకి పవన్ కి అండగా తాము ఉంటామని ఆయన స్పష్టమైన ప్రకటన చేశారు.మొత్తానికి మాధవ్ బీజేపీ అధ్యక్షుడు అయిన వెంటనే పవన్ కి అండగా ఉంటామని భారీ ప్రకటన చేశారు. మరో వైపు చూస్తే ఏపీలో టీడీపీ పెద్దన్నగా కూటమిలో ఉంది. మిత్రులుగా ఉన్న జనసేన బీజేపీల మధ్య మరింత సఖ్యతను సాధించేందుకు కూడా కొత్త అధ్యక్షుడు కృషి చేస్తారు అని అంటున్నారు. తద్వారా ఏపీలో కూటమిలో సరికొత్త సమీకరణలకు ఏమైనా నాంది ప్రస్తావన జరుగుతుందా అన్నది చర్చగా ఉంది.కూటమి అంటే మూడు పార్టీలని అందరికీ సమానంగానే అవకాశాలు ఉండాలని బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు చేసిన వ్యాఖ్యలు కానీ మాధవ్ పవన్ కి అండగా ఉంటున్న వైనం కానీ చూస్తే ఇక మీదట మోడీ తరహాలో పవన్ తో చేయి కలిపి ముందుకు నడిచే బీజేపీ మిత్రుడు ఏపీలోనూ ఉంటారని అంటున్నారు తద్వారా కూటమిలో సైతం రాజకీయ బలాలు కూడా మారుతాయని అంటున్నారు.

# అమరావతి,బనకచర్ల.. రెండూ రెండు కళ్లు!

అమరావతి,ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ ప్రాధాన్యాలు మారాయా? గతంలో అంటే అమరావతి, అంటే పోలవరం అన్న చంద్రబాబు ఇప్పుడు పోలవరం బుధులుగా బనకచర్లకు ప్రాధాన్యమిస్తున్నారని అంటున్నారు. గోదావరి వరద జలాలను వృథాగా సముద్రం పాల్జేయడం కన్నా, కరువు సీమ రాయలసీమకు తరలించాలనే ఉద్దేశంతో పోలవరం–బనకచర్లకు చంద్రబాబు ప్రతిపాదిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై తెలంగాణలో రాజకీయ పక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా, రాష్ట్రానికి చెందిన మేధావులు సైతం బనకచర్ల ప్రతిపాదనతో ప్రయోజనం ఏం లేదని పెదవి విరుస్తున్నారు. అయితే ముఖ్యమంత్రిచంద్రబాబు మాత్రం తగ్గేదేలే అంటూ అమరావతితోపాటు బనకచర్లను పట్టాలెక్కించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు.రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోకూడదని అమరావతిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక చర్యలు తీసుకుంటున్నారు. మే 2వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి పనులను ప్రారంభించారు. మరోవైపు టెండర్లు ఖరారు చేస్తూ అమరావతి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. ఇంతవరకు చంద్రబాబు ప్రయత్నాలపై ఎవరికీ అభ్యంతరాలు లేకపోయినా, అమరావతిని మరింత విస్తరించాలని, అందుకోసం మరో 44 వేల ఎకరాల భూమి కావాలని ప్రతిపాదిస్తుండటమే విమర్శలకు తావిస్తోంది.అయితే, కొత్తగా రాజధాని కోసం 44 వేల ఎకరాలు సేకరించాలనే ప్రతిపాదనపై చంద్రబాబు వెనక్కి తగ్గడం లేదు. ఎవరు కాదన్నా, రాజధాని చుట్టుపక్కల గ్రామాల నుంచి 44 వేల ఎకరాలు సమీకరించాల్సిందేనంటూ చంద్రబాబు పిలుపునిస్తున్నారు. ఇందుకోసం ఆయన చెబుతున్న కారణాలు ఆసక్తికరంగా ఉన్నాయి. గతంలో రాజధాని కోసం సేకరించిన 34 వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తామన్న ప్రతిపాదన లేదు. కానీ, ఇప్పుడు అమరావతికి ప్రత్యేకంగా విమానాశ్రయం ఉండాలన్న ప్రతిపాదనతోపాటు కొత్తగా క్వాంటమ్ వాలీ, ఏఐ సిటీ ఇలా ఆధునిక టెక్నాలజీకి సంబంధించిన కార్యాలయాలు ప్రారంభించేందుకు అదనంగా భూమి అవసరమని రైతులకు నచ్చజెబుతున్నారు చంద్రబాబు.ప్రస్తుతం రాజధాని అమరావతి రైతుల నుంచి సేకరించిన 34 వేల ఎకరాల భూముల యజమానులకు ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తున్నామో అవే తాజాగా భూములు ఇచ్చిన రైతులకు వర్తింపజేస్తామని చంద్రబాబు చెబుతున్నారు. దీంతో రైతులు వ్యతి రేకించినా కూడా భూములు సేకరించాల్సిందేనన్న పట్టుదల ప్రభుత్వంలో కనిపి



స్తోందని అంటున్నారు. ఇదే సమయంలో బనకచర్లపై వస్తున్న అభ్యంతరాలను అధిగమించేలా ముఖ్యమంత్రి పకడ్బందీ వ్యూహరచన చేస్తున్నారు. తెలంగాణలోని కొందరు నేతలు ఫిర్యాదు చేయడంతో బనకచర్లపై కేంద్ర పర్యావరణ శాఖ కొర్రీలు వేసిన విషయం తెలిసిందే. అయితే గత పదేళ్లలో గోదావరి మిగులు జలాలు ఏ మేరకు సముద్రంలో కలిశాయో లెక్కలు చూపుతూ, వృథాగా పోతున్న నీటిని వాడుకుంటామని కేంద్రానికి తెలియజేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకొంటున్నారని చెబుతున్నారు. ఈ విషయంలో గతంలో తెలంగాణ ముఖ్యమంత్రిగా పనిచేసిన ప్రస్తుత ప్రతిపక్ష నేత కేసీఆర్ ప్రకటనలను కూడా తమ నివేదికతో జత చేయాలని సీఎం చంద్రబాబు సూచించారని అంటున్నారు. దీంతో రాజకీయంగా బనకచర్లకు వస్తున్న అడ్డంకులకు ఫుల్ స్టాప్ వేయాలన్నది ముఖ్యమంత్రి వ్యూహంగా చెబుతున్నారు.

## రష్యాతో వాణిజ్యాన్ని సహించం

వాషింగ్టన్,రష్యా తో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తే భారత్, చైనా లపై 500 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా హెచ్చరించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుతో యూఎస్ సెనేట్‌లో దీనిపై బిల్లు తెస్తామని తెలిపింది. రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు వ్యాఖ్యానించారు.భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరనుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. చాలా తక్కువ సుంకాలతోనే ఈ డీల్ ఉండనున్నట్లు తెలిపారు. 'త్వరలోనే భారత్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నాం. అది ఒక కొత్త డీల్ అవుతుంది. ప్రస్తుతం భారత్ ఇంకా దాన్ని అంగీకరించలేదు.


# జగన్‌కు సైలెంట్ ప్రచారం.. కీలక నేత ఎంట్రీ ..!

హైదరాబాద్,ఎన్నికలకు నాలుగు సంవత్సరాల సమయం ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం కనిపిస్తోం ది. ప్రధాన ప్రతిపక్షం కాకపోయినా.. వైసీపీ దూకుడు పెంచింది. ప్రజల మధ్యకు వెళ్తోంది. గత ఎన్నికల కు ముందు ఇచ్చిన చంద్రబాబు హామీలను గుర్తు చేస్తోంది. తద్వారా చంద్రబాబుపై ఒత్తిడి పెంచుతోంది. ఈ సమయంలో జగన్‌కు అనుకూలంగా చాపకింద నీరులా మరో కీలక నేత ఎంట్రీ ఇచ్చారు.తరచుగా రాష్ట్రానికి వస్తున్న ఆయన.. చంద్రబాబుకు వ్యతిరేకంగా చక్రం తిప్పుతున్నారు. ఆయనే హైదరా బాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ. ఎంఐఎం పార్టీ అధినేతగా ఆయన ముస్లిం సామాజిక వర్గం తో తరచుగా ఏపీ లో భేటీ అవుతున్నారు. కర్నూలు, గుంటూరు, కడప జిల్లాల్లోని మైనారిటీ వర్గాలతో భేటీ అవుతున్న ఆయన ప్రధానంగా వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా పోరాడేందుకు తన సామాజిక వర్గాన్ని ఏకం చేయాల్సి ఉంది.అయితే.. దీనికి భిన్నంగా ఎంఐఎం అధినేత వ్యవహరిస్తున్నారన్నది టీడీపీ నాయకులు గుర్తించిన విషయం. పరోక్షంగా వైసీపీకి ప్రచారం చేస్తున్నారని చెబుతున్నారు. మైనారిటీ ముస్లింలకు కూటమి ప్రభు త్వం ఏమీ చేయడం లేదని.. ముస్లింలకు అన్యాయం జరుగుతోం ద ని గతంలో ఇచ్చిన పథకాలను ఇప్పు డు అమలు చేయడం లేదని చెబుతున్నారు. ఇదేసమయంలో వ క్ఫ్ బోర్డు విషయంలో చంద్రబాబు కూటమి పార్టీల తరఫున అనుకూలంగా వ్యవహరించారని ప్రచారం



చేస్తున్నారు.తద్వారా ఆయనపై వ్యతిరేకత పెంచేలా ప్రయత్నాలు చేస్తున్నారు. వారానికి రెండు సార్లు ఏపీకి వస్తున్న అసదుద్దీన్ ద్వారా.. మైనారిటీ ఓటర్లను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు అయితే జరుగు తున్నాయి. అయితే.. నేరుగా వైసీపీని ప్రస్తావించని ఒవైసీ.. కూటమిని ఓడించాలని మాత్రం పిలుపునిస్తు న్నారు. అంటే.. ఒకరకంగా జగన్ కు ఆయన సైలెంట్ ప్రచారం చేస్తున్నారన్నది స్పష్టంగా తెలుస్తోంది. మరి ఇది ఏమేరకు కూటమికి మైనస్ అవుతుంది? ఏమేరకు.. జగన్‌కు ప్లస్ అవుతుందన్నది చూడాలి.

# వంశీకి వైసీపీ ఘన స్వాగతం...తెరపైకి ఆసక్తికర ప్రచారం!



విజయవాడ: వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బుధవారం విజయవాడ సబ్ జైలు నుంచి విడుదలయ్యారు. ఫిబ్రవరి 16న అరెస్టైన వంశీ.. సుమారు 140 రోజులుగా జైల్లోనే ఉన్నారు. ఇప్పటి వరకు ఆయనపై 11 కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో తాజాగా అన్ని కేసుల్లోనూ బెయిల్ రావడంతో జైలు నుంచి బయటకు వచ్చారు. ఈ సమయంలో వైసీపీ ఘన స్వాగతం పలికింది!అవును... నకిలీ ఇళ్ల పట్టాల కేసులో బెయిల్ మంజూరు కావడంతో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విజయవాడ సబ్ జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి బయటకు వచ్చిన ఆయన.. మీడియాతో మాట్లాడకుండా కారు ఎక్కి వెళ్లిపోయారు. ఈ సమయంలో వంశీ కోసం... ఆయన భార్య, మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ జైలు వద్దకు వచ్చారు.ఈ సమయంలో... స్థానిక వైసీపీ నాయకత్వం వంశీకి స్వాగతం పలికింది. ఇందులో భాగంగా... విజయవాడ జైలు నుండి అతని వరకూ ఓ భారీ కాన్వాయ్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారీగా పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్లపై హల్ చల్ చేశాయి. ఈ సమయలో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడిన దృశ్యాలు నెట్టింట వైరల్ గా మారుతున్నాయి!

రాజకీయాలకు బై బై చెప్పబోతున్నారా?:

సుమారు 140 రోజుల పాటు జైల్లో మగ్గిన మాజీ ఎమ్మెల్యే వంశీ గురించిన ఓ ఆసక్తికర విషయం గన్నవరం నియోజకవర్గం నుంచి వినిపిస్తుంది! ఇందులో భాగంగా... గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడంతో పాటు, సుమారు 11 కేసులు మీద ఉన్న నేపథ్యంలో.. వైసీపీని వదిలి, రాజకీయాలకు శాశ్వతంగా దూరం కావాలన్ని వంశీ భావిస్తున్నారనే ప్రచారం మొదలైంది.ఈ సందర్భంగా విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని సహా పలువురు ఈ సమయంలో వంశీకి పరోక్షంగా ఆదర్శంగా మారుతున్నారనే కామెంట్లు వినిపిస్తున్నాయి. మరి కొన్ని రోజులు కాస్త ఆరోగ్యం కుదుటి పడిన తర్వాత తన రాజకీయ భవిష్యత్తుపై వంశీ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచి చూడాలి.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**